

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 03-08-2025 | సంపుటి - 24 | సంచిక - 89 | రూ : 4 | పేజీలు: 8




2లో

## పెరిగిన భారత్... ఫారెక్స్ నిల్వలు..

- ఫారెక్స్ నిల్వలు 2.703 బిలియన్లు పెరిగి 698.192 బిలియన్లకు చేరుకున్నాయన్న ఆర్బీఐ
- విదేశీ మారక ద్రవ్య ఆస్తులు 588.926 బిలియన్లకు పెరిగాయని వెల్లడి
- ఈ వారంలో బంగారం నిల్వలు 1.206 బిలియన్లు పెరిగి 85.704 బిలియన్లకు చేరుకున్నాయని వివరణ

### తెలంగాణ పోరాట స్ఫూర్తి

# ఆటల్లో చూపిద్దాం...

**ప్రపంచంతో పోటీ పడేందుకే నూతన క్రీడా విధానం రూపొందించాం**

- ఒలింపిక్స్‌లో పతకాలే మన లక్ష్యం
- రెండు ఆటల ఆతిథ్యానికీ సిద్ధం
- సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి
- కాంక్లేవ్ సందర్భంగా స్పోర్ట్స్ పాలసీ ఆవిష్కరణ
- హాజరైన ప్రముఖ క్రీడాకారులు

హైదరాబాద్: క్రీడల్లో ప్రపంచంతో తెలంగాణ పోటీపడేలా స్పోర్ట్స్ పాలసీని రూపొందించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీలతో రాష్ట్ర క్రీడా రంగాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ విజన్

తరువాయి 2లో





2లో

## రష్యాలో ఆగని భూకంపాలు

- భారీ భూకంపం, సునామీ హెచ్చరికలతో వణుకుతున్న కమ్చత్కా
- రష్యాలోని కమ్చత్కాలో ఆగని భూప్రకంపనలు
- కొన్ని రోజుల క్రితం 8.7 తీవ్రతతో భారీ భూకంపం
- తాజాగా శనివారం 5.4 తీవ్రతతో మరోసారి ప్రకంపనలు
- భారీ భూకంపం తర్వాత జారీ అయిన సునామీ హెచ్చరికలు
- స్థానికుల్లో తీవ్ర భయాందోళన, భవనాలకు నష్టం
- 'పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్'లో ఉండటమే వరుస భూకంపాలకు కారణం

### ఏపీ స్కూళ్లలో కొత్త నిబంధనలు..

# ఇకపై వారికి నో ఎంట్రీ!

**ఏపీలోని పాఠశాలల్లో రాజకీయ చిహ్నాల ప్రదర్శనపై పూర్తి నిషేధం**

- అనధికార వ్యక్తులు స్కూల్ ప్రాంగణాల్లోకి ప్రవేశించడం నిషిద్ధం
- తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులకు మాత్రమే అనుమతి
- పిల్లలతో ఫొటోలు దిగడాన్ని కూడా నిషేధించిన ప్రభుత్వం



2లో

### ఇందిరమ్మ ఇళ్ల విషయంలో

## కేంద్రం కొర్రీలు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నదీ జలాలకు సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాల పంచాయితీలో తెలంగాణ ప్రయోజనాలే లక్ష్యంగా పోరాటం చేస్తామని పేర్కొన్నారు. బనకచర్లపై ఏపీ మంత్రి లోకేశ్ అవగాహన లేకుండా మాట్లాడారని విమర్శించారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో పొంగులేటి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో నాకు పేరు రాకుండా నిబంధనల పేరుతో కేంద్రం కొర్రీలు పెడుతోంది. ఇళ్ల సర్వేకు సంబంధించి కేంద్రం యాప్ కన్నా రాష్ట్రం రూపొందించింది బాగున్నా ఒప్పుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వ షరతులకు అనుగుణంగా రాష్ట్రంలో ఇప్పటివరకు మూడు లక్షల ఇళ్ల సర్వే పూర్తయింది. ఒక్కో ఇంటికి కేంద్రం గ్రామీణంలో

తరువాయి 2లో



2లో

### మతపరమైన లబ్ధికే

# కాంగ్రెస్ నాటకం

- రాష్ట్రంలో భాజపా అధికారం చేపట్టాక 42% రిజర్వేషన్లు బీసీలకే కేటాయిస్తాం
- మహాధర్నాలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నల్లకుంట : బీసీలకు 42% రిజర్వేషన్లపై ఇచ్చిన హామీ అమలు చేయడం చేతకాని కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వంపై నిందలు వేయడం సిగ్గుచేటని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆ రిజర్వేషన్లు బీసీలకు మేలు చేసేవి కావని, మతపరంగా లబ్ధితోపాటు కేవలం రాజకీయాల కోసమే ఆ పార్టీ నాటకమాడుతోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌పై ఆ పార్టీ తీరుకు నిరసనగా శనివారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద భాజపా ఓబీసీ మోర్చా చేపట్టిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ముస్లింలకు 12% రిజర్వేషన్లు తెస్తామంటూ మజ్లిస్ పార్టీ చెప్పుచేతల్లో కొనసాగి.. స్థానిక సంస్థల్లో బీసీలకున్న 34% రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించి వారికి అన్యాయం

తరువాయి 2లో

### భారత్ ఎకానమీ 'డెడ్' అన్న ట్రంప్..

# గట్టిగా బదులిచ్చిన ప్రధాని మోదీ



2లో

- ట్రంప్ విమర్శలకు మోదీ కౌంటర్
- త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ అవతరిస్తుందన్న ప్రధాని
- 2028 నాటికి మూడో స్థానం ఖాయమంటున్న మోర్గాన్ స్టాన్లీ నివేదిక
- ప్రగతి ఫలాలు నిరుపేదలకూ అందుతున్నాయని మోదీ వ్యాఖ్య
- ప్రపంచ వృద్ధిలో 16 శాతానికి పైగా వాటా భారత్‌దేనని స్పష్టీకరణ



## దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం అవసరం

- రాజకీయాల్లో యువత చురుకైన పాత్ర పోషించాలి
- రాష్ట్ర ఏఐసీసీ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్...
- జనహితం కోసమే పాదయాత్ర: పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్...
- జోగిపేట డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శ్రమదానం...

2లో

# భారత్ ఎకానమీ 'డెడ్' అన్న ట్రంప్.. గట్టిగా బదులిచ్చిన ప్రధాని మోదీ

భారత ఆర్థిక వ్యవస్థ 'చచ్చిపోయింది' (డెడ్ ఎకానమీ) అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తీవ్ర విమర్శలపై ప్రధాని నరేంద్ర మోదీ గట్టిగా బదులిచ్చారు. భారత్ త్వరలోనే ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరించబోతోందని, విమర్శలకు గణాంకాలే సమాధానం చెబుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం భారత, అంతర్జాతీయ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ట్రినిడాడ్ అండ్ టొబాగో పర్యటనలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రధాని మోదీ ఈ విషయంపై స్పందించారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచిందని ఆయన స్పష్టం చేశారు. "భారత్ సాధిస్తున్న వృద్ధి, ప్రగతి ఫలాలు దేశంలోని నిరుపేదలకు, అట్టడుగు వర్గాలకు సైతం అందుతున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు దీనికి నిదర్శనం" అని మోదీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ వ్యాఖ్యలకు అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నివేదికలు కూడా బలం చేకూరుస్తున్నాయి. ప్రముఖ సంస్థ మోర్గాన్ స్టాన్లీ 2025లో విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2028 నాటికి భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని అంచనా వేసింది. గతంలో ఘనా వంటి దేశాల్లో పర్యటించినప్పుడు కూడా మోదీ ఇదే విషయాన్ని ప్రస్తావించారు. ప్రపంచ వృద్ధిలో భారత్ వాటా దాదాపు 16 శాతంగా ఉందని, స్టార్టప్ వ్యవస్థలో ప్రపంచంలోనే మూడో స్థానంలో నిలిచిందని ఆయన గుర్తుచేశారు.

# దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం అవసరం




అందోలు, ప్రజాస్ఫూర్తి: దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం అవసరమని ఏఐసీసీ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ అన్నారు. దేశం బాగుండాలంటే నేటి యువత రాజకీయాల్లోకి రావాలని, నాయకత్వ లక్షణాలను విద్యార్థి దశ నుంచే అలవర్చుకొవాలన్నారు. జనహిత పాదయాత్రలో భాగంగా శనివారం సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని నెహ్రూ మెమెరియల్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లతో కలిసి శ్రమదానం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలోని పిచ్చుమొక్కలను, పొదలను తొలగించి శుభ్రం చేశారు. కళాశాల ప్రాంగణంలో నాయకులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. అనంతరం విద్యార్థులతో ఆమె మాట్లాడుతూ రాజకీయాలపై ఎందుకు ఆసక్తిని చూపించడం లేదని వారిని ప్రశ్నించారు. మనం చేసే వృత్తిని నిజాయితీతో, నిబద్ధతతో చేసినప్పుడే సమాజంలో గౌరవం దక్కుతుందన్నారు. తాము కళాశాలలోనే శ్రమదానం నిర్వహించడం పట్ల విద్యార్థుల్లో అవగాహన పెరిగి, గ్రావల్లోని ప్రజలు పరిసరాలను శుభ్రపరిచే విధంగా వారిలో ప్రేరణ కలుగుతుందన్నారు. శ్రమదానం నిర్వహించడం వలన కలిగే ప్రయోజనాలను వారికి వివరించారు. విద్యార్థులు కష్టపడి చదివి, ఉన్నతమైన స్థానాల్లో ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

**–కళాశాల ప్రాంగణంలో శ్రమదానం**

జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శ్రమదానం కార్యక్రవ•న్ని చేపట్టారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లతో పాటు సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో శ్రమదానంలో పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణంలోని బొటానికల్ పార్కులో పెరిగిన పొదలను, పిచ్చుమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు.

**–జనహితం కోసమే పాదయాత్ర: మహేష్ కువర్‌గౌడ్**

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న జనహిత పాదయాత్ర ప్రజలకు చేరువయ్యేందుకేనని, వారి హితం కోసమేనని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అధికారంలో ఉన్నా...లేకపోయినా.... కాంగ్రెస్ పార్టీ విధానంలోనే పాదయాత్ర ఓ భాగమేనని ఆయన స్పష్టం చేశారు. మరో విడతలో నిర్వహించబోయే పాదయాత్రలో సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీలు సైతం పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ పాదయాత్ర వలన ప్రజల కష్టసుఖాలు, సమస్యలు, ప్రభుత్వ పనితీరు వంటి ఇతరత్రా అంశాలు తెలుస్తాయన్నారు.

**–కళాశాల సమస్యలను తీరుస్తా.. మంత్రి దామోదర్**

జోగిపేట డిగ్రీ, పీజీ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి సీ.దామోదర రాజనర్సింహ హామీనిచ్చారు. కళాశాలలో శ్రమదానం నిర్వహించిన అనంతరం అధ్యాపకులు మంత్రిని కలిసి సమస్యలను వివరించడంతో ఆయన స్పందించారు. కళాశాల తూర్పు వైపున ఖాళీ స్థలం ఉండడంతో పరిశీలించిన ఆయన మైదానాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అటువైపు నుంచే కళాశాల ప్రధాన గేటును ఏర్పాటు చేసుకుందామన్నారు. అంతేకాకుండా డిగ్రీ, పీజీ కళాశాల భవనాలకు మరమ్మత్తులను చేపట్టి, కలర్ వేయిద్దామన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యంపైనే ఎక్కువ దృష్టి పెట్టిందని ఆయన స్పష్టం చేశారు.

# పెరిగిన భారత్ ఫారెక్స్ నిల్వలలు

భారతదేశ విదేశీ మారక నిల్వలు 2.703 బిలియన్ డాలర్లు పెరిగి 698.192 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తెలిపింది. గత వారంలో నిల్వలు 1.183 బిలియన్ డాలర్లు తగ్గి 695.489 బిలియన్ డాలర్లకు పడిపోయాయని పేర్కొంది. జులై 25వ తేదీతో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వల గణాంకాలను ఆర్బీఐ వెల్లడించింది. విదేశీ మారక ద్రవ్య ఆస్తులు 588.926 బిలియన్ డాలర్లకు పెరిగాయని తెలిపింది. ఆర్బీఐ గణాంకాల ప్రకారం, విదేశీ మారక నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ మారక ద్రవ్య ఆస్తులు 1.316 బిలియన్ డాలర్లు పెరిగి 588.926 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఈ వారంలో బంగారం నిల్వలు 1.206 బిలియన్ డాలర్లు పెరిగి 85.704 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్బీఐ వెల్లడించింది. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్డీఆర్) 126 మిలియన్ డాలర్లు పెరిగి 18.809 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని తెలిపింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)లో భారతదేశం రిజర్వు స్థానం 55 మిలియన్ డాలర్లు పెరిగి 4.753 బిలియన్ డాలర్లకు చేరింది.

# రష్యాలో ఆగని భూకంపాలు

రష్యాలోని కమ్చత్కా ద్వీపకల్పంలో భూకంపాల ప్రకంపనలు కొనసాగుతున్నాయి. కొన్ని రోజుల క్రితం 8.7 తీవ్రతతో సంభవించిన భారీ భూకంపం, సునామీ భయాలను రేకెత్తించిన విషయం మరవక ముందే, శనివారం నాడు అదే ప్రాంతంలో మరోసారి భూమి కంపించింది. ఈ వరుస ఘటనలతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే, జులై 30న కమ్చత్కా తీరంలో శక్తివంతమైన భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 8.7గా నమోదైనట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే (యూఎస్జీఎస్) ధ్రువీకరించింది. తొలుత భూకంప తీవ్రతను 8.0గా అంచనా వేసినప్పటికీ, తాజా సమాచారం ఆధారంగా దానిని 8.7కు సవరించారు. పెట్రోపావ్లోవ్స్క్ కమ్చత్స్కీ నగరానికి ఆగ్నేయంగా 125 కిలోమీటర్ల దూరంలో, సముద్ర గర్భంలో 19.3 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. ఈ భారీ భూకంపం కారణంగా పసిఫిక్ మహాసముద్రంలోని పలు ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. రష్యా, జపాన్ తీర ప్రాంతాలను మూడు గంటల్లో సునామీ అలలు తాకే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. దీంతో అప్రమత్తమైన యంత్రాంగం తీర ప్రాంత ప్రజలను సురక్షితమైన, ఎత్తైన ప్రదేశాలకు తరలివెళ్లాలని సూచించింది.

# ఏపీ స్కూళ్లలో కొత్త నిబంధనలు.. ఇకపై వారికి నో ఎంట్రీ!

ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాలల్లో రాజకీయాలకు తావులేకుండా రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. విద్యా ప్రాంగణాల్లో రాజకీయ పార్టీల చిహ్నాలు, ప్రచార సామగ్రి ప్రదర్శనను పూర్తిగా నిషేధిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలల్లో అకడమిక్ వాతావరణాన్ని కాపాడే లక్ష్యంతో ఈ కఠిన నిబంధనలను అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కొత్త ఆదేశాల ప్రకారం, పాఠశాలల ప్రాంగణాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన జెండాలు, కండువాలు, బ్యానర్లు లేదా పోస్టర్లు వంటి ఎలాంటి ప్రచార సామగ్రిని ప్రదర్శించరాదు. అంతేకాకుండా, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు మినహా ఇతర అనధికార వ్యక్తులు, బృందాలు స్కూళ్లలోకి ప్రవేశించడాన్ని పూర్తిగా నిషేధించారు. కొంతకాలంగా అనధికార వ్యక్తులు పాఠశాలల్లోకి ప్రవేశించి, విరాళాలు లేదా బహుమతులు ఇచ్చే నెపంతో విద్యా కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని డైరెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, ఎవరైనా విరాళాలు లేదా వస్తువులు అందించాలనుకుంటే, వాటిని నేరుగా హెడ్‌మాస్టర్‌కు అందజేయాలని సూచించారు. తరగతి గదుల్లోకి ప్రవేశించడం, విద్యార్థులతో నేరుగా మాట్లాడటం వంటివి చేయకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా, పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి ఫోటోలు దిగడాన్ని కూడా కచ్చితంగా నిషేధించారు. ఫిర్యాదులు, వినతులు లేదా అభ్యర్థనలు ఏవైనా ఉంటే, వాటిని పాఠశాల పరిపాలనా కార్యాలయానికి మాత్రమే సమర్పించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ విషయాల్లో సిబ్బంది, విద్యార్థులతో బయటి వ్యక్తులు నేరుగా సంప్రదించరాదని స్పష్టం చేశారు. ఈ మార్గదర్శకాలను తక్షణమే కఠినంగా అమలు చేయాలని రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులకు, ఫీల్డ్ ఫంక్షనరీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# తెలంగాణ పోరాట స్ఫూర్తి ఆటల్లో చూపిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

2047 డాక్యుమెంట్‌లో స్పోర్ట్స్ పాలసీకి ఒక ఛాప్టర్ కేటాయించామని చెప్పారు. నూతన క్రీడా విధానంతో రాష్ట్రంలో కొత్త అధ్యాయం మొదలు కానుందని సీఎం వివరించారు. శనివారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్‌లో రాష్ట్ర నూతన క్రీడా విధానాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ''తెలంగాణ క్రీడా విధానం ఒక కాగితం కాదు.. బంగారు అక్షరాలతో రాసిన పత్రం. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే మా లక్ష్యం. స్పోర్ట్స్ పాలసీతో రాష్ట్రంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమవుతుంది'' అని సీఎం ఈ సందర్భంగా అన్నారు. క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి, శాట్ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఒలింపియన్లు అభినవ్ బింద్రా, గగన్ నారంగ్, భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, భారత అథ్లెటిక్స్ సమాఖ్య సీనియర్ ఉపాధ్యక్షురాలు అంజు బాబీ జార్జ్, వెటరన్ వాలీబాల్ ఆటగాడు రవికాంత్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ''చాలా లోతుగా ఆలోచించి స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చాం. ఈ మధ్యకాలంలో యువత డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. సైబర్ క్రైమ్, డ్రగ్స్ సమాజానికి ఎంతో ప్రమాదకరం. క్రీడలను ప్రోత్సహించకపోవడం వల్లే ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయి. తెలంగాణ ఉద్యమంలో ముందు వరుసలో నిలిచి పోరాటం చేసింది యువత. పోరాట స్ఫూర్తి, చైతన్యం ఉన్న ఈ ప్రాంతం క్రీడల్లోనూ రాణించాలి. ప్రపంచంతోనే పోటీ పడాలి. ఈ లక్ష్యంతోనే క్రీడా విధానాన్ని రూపొందించాం.



**ఆది నుంచీ మనది క్రీడా సంస్కృతి**

తెలంగాణ ప్రజల జీవితాల్లో క్రీడలు అంతర్భాగం. 1956ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన భారత ఫుట్‌బాల్ జట్టులోని తొమ్మిది మంది హైదరాబాదీలే. స్వాతంత్ర్యం రాకముందు నుంచే తెలంగాణలో క్రీడా సంస్కృతి ఉంది. అనంతర కాలంలో మహ్మద్ అజహరుద్దీన్, వీవీఎస్ లక్ష్మణ్, రవికాంత్‌రెడ్డి వంటి క్రీడాకారులు రాష్ట్రానికి ఎంతో పేరు తీసుకొచ్చారు. ఇటీవల కాలంలో అద్భుతంగా రాణిస్తున్న క్రికెటర్ సిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్, అథ్లెట్ జీవాంజి దీప్తిలకు ప్రోత్సాహం అందిస్తున్నాం. క్రీడాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్రం కలిసి పనిచేయాలి. 2026లో ఖేలో ఇండియా క్రీడల నిర్వహణకు అవకాశమివ్వాలని కేంద్రాన్ని కోరాం'' అని రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ కాంక్లేవ్‌లో తెలంగాణ ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు వేణుగోపాలాచారి, క్రీడలు, యువజన సర్వీసుల ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, శాట్ ఎండీ సోనిబాలాదేవి తదితరులు పాల్గొన్నారు. క్రీడల్లో రాణించిన అగసర నందినికి రూ.5 లక్షలు, నిషిక అగర్వాల్‌కు రూ.3 లక్షలు, ధనుష్‌శ్రీకాంత్‌కు రూ.10 లక్షలు.. పారా క్రీడాకారులు పవన్ కల్యాణ్, సాయి తేజలకు రూ.4.80 లక్షలు ఆర్థిక ప్రోత్సాహకాలను సీఎం అందించారు.

**క్రీడా శిక్షణ కోసం ఒప్పందాలు**

అకాడమీలు, స్పోర్ట్స్ సైన్స్, ప్రతిభావంతుల గుర్తింపు కోసం ప్రణాళిక రూపొందించడానికి భారత క్రికెట్ మాజీ కెప్టెన్, టెన్విక్ వ్యవస్థాపకుడు అనిల్ కుంబ్లేతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలో 238 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని 15 వేల మంది విద్యార్థుల్లో ప్రతిభావంతుల్ని టెన్విక్ గుర్తిస్తుంది. 50 కేంద్రాల్లో 10 క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనుంది. షూటింగ్‌లో గగన్ నారంగ్‌తో.. షూటింగ్ స్పోర్ట్స్ సైన్స్‌లో అభినవ్ బింద్రాతో, ఫిఫా టాలెంట్ డెవలప్‌మెంట్ అకాడమీ కోసం ఏఐఎఫ్ఎఫ్‌తో, ఒలింపిక్ వాల్యూ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్, స్పోర్ట్స్ ప్రి, ఆస్పైర్ ఫర్ హర్ సంస్థలతో ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. రాష్ట్రంలో క్రీడాభివృద్ధి కోసం పాలకమండలిని ఏర్పాటు చేసింది. దీనికి సంజీవ్ గోయెంకా ఛైర్‌పర్సన్‌గా, ఉపాసన కొణిదెల వైస్ ఛైర్‌పర్సన్‌గా, యువజన సర్వీసులు.. క్రీడలు, యువజన సర్వీసుల ముఖ్య కార్యదర్శి, శాట్ ఛైర్మన్, కపిల్‌దేవ్, అభినవ్ బింద్రా, పుల్లెల గోపీచంద్, గగన్ నారంగ్, రవికాంత్‌రెడ్డి, బైచుంగ్ భూటియా, వీటా దానీ, అంజు బాబీ జార్జ్, కావ్య మారన్, మాజీ సలహాదారు పాపారావు, సాయ్ మాజీ డీజీ ఇంజేటి శ్రీనివాస్, శశిధర్‌లను సభ్యులుగా నియమించింది.

# ఏపీకి గడ్కరీ భారీ కానుక..
## రూ. 26 వేల కోట్లకు తక్షణ ఆమోదం, మరో లక్ష కోట్లకు హామీ

ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీ అండగా నిలిచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన విజ్ఞప్తికి తక్షణమే స్పందించిన కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, వేదిక పైనుంచే ఏకంగా రూ. 26,000 కోట్ల విలువైన ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతేకాకుండా, ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా రాష్ట్రానికి మరో రూ. 1 లక్ష కోట్ల విలువైన ప్రాజెక్టులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించి, రాష్ట్ర అభివృద్ధి పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. శనివారం అమరావతిలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ. 2,852 కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులను జాతికి అంకితం చేయడంతో పాటు, రూ. 2,381 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, సంపద సృష్టికి రహదారులే మూలమని స్పష్టం చేశారు. "ఉదయం అన్నదాత సుఖీభవతో సంక్షేమానికి శ్రీకారం చుట్టాం. సాయంత్రం రహదారుల వంటి అభివృద్ధి కార్యక్రమాలతో సంపద సృష్టికి బాటలు వేస్తున్నాం. ఇది చరిత్రాత్మకమైన రోజు" అని ఆయన అభివర్ణించారు. నితిన్ గడ్కరీని 'పట్టుదల, కృషి,



వేగానికి నిలువుటద్దం' అని కొనియాడిన చంద్రబాబు, ఆయన మాటలు అభివృద్ధిని ఆకాంక్షించే వారికి సంగీతంలా ఉంటాయని అన్నారు. గతంలో కేంద్ర జలవనరుల శాఖ మంత్రిగా గడ్కరీ పోలవరం ప్రాజెక్టుకు ప్రాణం పోశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణలో పూర్తి సహకారం అందిస్తామని, పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని చంద్రబాబు కేంద్రానికి హామీ ఇచ్చారు. మహారాష్ట్రతో పాటు ఆంధ్రప్రదేశ్‌ను కూడా తమ సొంత రాష్ట్రంగా భావించి అభివృద్ధికి సహకరించాలని ఆయన గడ్కరీని కోరారు. సీఎం విజ్ఞప్తి మేరకు విజయవాడ హైదరాబాద్, విజయవాడ మచిలీపట్నం రహదారులను ఆరు వరుసలుగా విస్తరించడం, గుంటూరు వినుకొండ మధ్య నాలుగు వరుసల రహదారి వంటి కీలక ప్రాజెక్టులకు గడ్కరీ వేదికపై నుంచే ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో రవాణా వ్యవస్థ మరింత పటిష్ఠం కానుంది. గడ్కరీ స్ఫూర్తితోనే హైదరాబాద్‌లో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించామని, ఇప్పుడు అమరావతికి కూడా 189 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డుకు ఆమోదం లభించిందని సీఎం హర్షం వ్యక్తం చేశారు.

# మతపరమైన లబ్ధికే కాంగ్రెస్ నాటకం

(మొదటిపేజీ తరువాయి)

చేసిందన్నారు. అదే బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన కొనసాగుతోందని ఆరోపించారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో ఎస్సీ, ఎస్టీ, ముస్లింల జనాభా పెరిగినట్లు, బీసీల జనాభా తగ్గినట్లు చూపిందని దీనివల్ల ఎవరికి న్యాయం జరిగినట్లో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. 42% రిజర్వేషన్లలో 10% ముస్లింలకు తీసివేస్తే బీసీలకు మిగిలేది 32 శాతమే అన్నారు. గతంలో బీసీలకు ఉన్న రిజర్వేషన్ల కంటే కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు చెబుతున్న రిజర్వేషన్లు 2% తక్కువనే విషయాన్ని గుర్తించాలని కోరారు. రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వచ్చాక 42% రిజర్వేషన్లను బీసీలకు మాత్రమే కల్పిస్తామని స్పష్టం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడే బీసీ జనగణన ఎందుకు చేపట్టలేదో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పాలన్నారు.

*** ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు తొలగించాలి**

స్థానిక సంస్థల రిజర్వేషన్లను అమలుచేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్నా తెలంగాణ సర్కార్ అలా చేయకుండా నెపాన్ని కేంద్రంపై నెట్టడం తగదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. బీసీలపై కాంగ్రెస్ పార్టీకి ప్రేమ ఉంటే ముస్లింలకు ఇవ్వాలని భావిస్తున్న 10% రిజర్వేషన్లను తొలగించి.. మొత్తం 42% బీసీలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ... రిజర్వేషన్లు 50% మించకూడదనే వాదన తప్పు అని అన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో 80% వరకు రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కు చిత్తశుద్ధి ఉంటే ఆర్టికల్ 340, కమిషన్స్ ఆఫ్ ఎంక్వైరీ 1952 చట్ట ప్రకారం కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపా తప్పకుండా అధికారంలోకి వస్తుందని.. దాన్ని అడ్డుకునేలా ఏదో ఒక వర్గానికి వ్యతిరేకమన్న ముద్ర వేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, సీనియర్ నేతలు బూర నర్సయ్యగౌడ్, బీబీ పాటిల్, కాసం వెంకటేశ్వర్లు, రామచంద్రారెడ్డి, లక్ష్మీనారాయణ, ప్రేమ్‌సింగ్‌రాథోడ్, కేఎస్ రత్నం, బండ కార్తీకరెడ్డి, ఓబీసీ మోర్చా తెలంగాణ అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ తదితరులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత ఓబీసీ మోర్చా నేత శ్రీనివాస్.. దున్నపోతులతో ధర్నాచౌక్ వరకు ర్యాలీ చేపట్టారు.

# సీపీఐ 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేద్దాం

* **ఉప్పల్ నియోజకవర్గం ఆధ్వర్యంలో గోడపత్రిక విడుదల**

ప్రజాస్ఫూర్తి , కాప్రా : సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 4వ రాష్ట్ర మహాసభలు ఈనెల 19 నుండి 22వ తేదీ వరకు మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో నాలుగు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివెస్. బోస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో, ఈసీఐఎల్ లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ లో మహాసభలకు సంబంధించిన గోడ పత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన వివెస్. బోస్ మాట్లాడుతూ, "సిపిఐ వందేళ్ల చరిత్రతో ముందుకు సాగుతున్న పార్టీ. ప్రజలతో మరింత మమేకం కావడం కోసం ఈ మహాసభలు ఎంతో కీలకంగా ఉంటాయి. గత మూడేళ్లలో బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద, ఫాసిస్టు విధానాలను బహిరంగంగా ఉతికి పారేయడంలో సిపిఐ కీలక పాత్ర పోషించింది," అని అన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని 240 సీట్లకు పరిమితం చేయడంలో కమ్యూనిస్టుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. అలాగే అసంఘటిత కార్మికుల వేతనాల కోసం నిరంతరం పోరాటాలు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే, బిసి బిల్లులపై బీజేపీ అవలంబిస్తున్న ద్వంద్వ వైఖరిని ఆయన తీవ్రంగా విమర్శించారు."ఒకవైపు బిసి బిల్లుకు అడ్డుపడుతూ, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందించడం దుర్మార్గం. బిసి బిల్లులను నాలుగు నెలలుగా ఆమోదించకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం," అని తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు రాష్ట్ర స్థాయి కార్యచరణపై మహాసభల వేదికగా చర్చించి, భవిష్యత్తు పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు జీ. దామోదర్ రెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి. సత్య ప్రసాద్, నారా నర్సింహా, లక్ష్మీ నారాయణ, బాబూరావు, సాంబశివరావు, మిరియాల సాయిలు, జాన్, శ్రీనివాస్, ఎల్లయ్య, నర్సింగరావు, నాగేష్, స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి పుట్టిన రోజు వేడుకలు

**– మొక్కలు నాటిన మొక్కల రాజశేఖర్, నైనిక రజువా**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి 43వ పుట్టినరోజు వేడుకలు శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి ప్రేమికులు, గ్రీన్ మోటార్ వెహికల్ గార్డెన్ వ్యవస్థాపకులు, సింగరేణియన్ కొట్టూరు నర్వి రాజశేఖర్ (మొక్కల రాజశేఖర్) మరియు కొత్తగూడెం సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థిని, ప్రకృతి హరిత దీక్షపరురాలు నైనిక రజువా, మహమ్మద్ ఆఫాన్ జైది లు కలిసి మామిడి మొక్కను నాటి సీతాలక్ష్మికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీతాలక్ష్మి మాట్లాడుతూ ''పూల బొకేలు వద్దు.. పచ్చని మొక్కలే ముద్దు'' అనే స్ఫూర్తిదాయక కార్యక్రమాన్ని ప్రారంభించిన మొక్కల రాజశేఖర్ సేవలను అభినందించారు. పర్యావరణ పరిరక్షణకు ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. అలాగే మొక్కల రాజశేఖర్ వద్ద ప్రకృతి హరిత దీక్ష తీసుకున్న నైనిక రజువా, మహమ్మద్ ఆఫాన్ జైదిలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

## మీ ప్రేమను మరవలేను

* **రాష్ట్ర వ్యవహారాల కాంగ్రెస్ ఇంచార్జి మీనాక్షి నటరాజన్**
* **7 కి.మీ వెనక్కి వచ్చి మరీ డాక్టర్ వీరన్న కుటుంబానికి కృతజ్ఞతలు**



అందోలు, ప్రజాస్ఫూర్తి: ఎవరైనా రాజకీయ నాయకులు కలసినప్పుడు వారితో ఫోటోలు దిగడం, దాన్ని తమకు మైలేజీ వచ్చే విధంగా వ్యవహరించడం చూసాను. కానీ తాను రెండు రోజుల పాటు బస చేసేలా అవకాశం కల్పించిన డాక్టర్ వీరన్న, డాక్టర్ శృతి కుటుంబం రాష్ట్ర వ్యవహారాల కాంగ్రెస్ ఇంచార్జి మీనాక్షి నటరాజ్ పై చూపిన ప్రేమ ఆప్యాయతకు ఆమె ముగ్ధురాలయ్యారు. అందోలు నియోజకవర్గంలో ఆగస్టు 1వ తేదిన నిర్వహించిన జనహిత పాదయాత్రకు హజరైన రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజ్‌కు జోగిపేటకు చెందిన డాక్టర్ వీరన్న ఇంట్లో శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు బస కల్పించారు. నిరాడంబరంగా ఉండే ఆమెకు వీలుగా అన్ని సౌకర్యాలను కల్పించడంతో ఆమె సంతృప్తిని వ్యక్తం చేశారు. మొదటి రోజున పాదయాత్రను పూర్తి చేసుకొని శుక్రవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో డాక్టర్ ఇంటికి చేరుకున్నారు. రాత్రికి జొన్న రొట్టె, పప్పుతో డాక్టర్ కుటుంబ సభ్యులు, తన వెంట వచ్చిన మహిళలతో కలిసి బోజనం చేశారు. రాత్రంతా కుటుంబ సభ్యులతో డాక్టర్ కూతురు చిన్నారితో ముచ్చటించి ముచ్చట తీర్చుకున్నారు. శనివారం ఉదయమే లేచి తనవెంట తెచ్చుకున్న టూత్ బ్రెష్, సబ్బులను వినియోగించడం విశేషం. ఇడ్లీ, ఉప్మాతో ఉదయం టిఫిన్ చేసారు. అనంతరం సంగుపేట వద్ద ఉన్న ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి వెళుతూ వెళ్లేటప్పుడు తప్పకుండా మిమ్మల్ని కలిసే వెళతానని చెప్పి మీటింగ్ అయిపోగానే కేవలం డాక్టర్ కుటుంబ సభ్యులను కలవడానికి 7 కి.మీ వెనక్కి వచ్చి మీరు రెండు రోజుల పాటు నాకు ఇచ్చిన అథిత్యాన్ని మరవలేనని, మిమ్మల్ని ఎప్పటికి గుర్తించుకుంటానని చెప్పి డాక్టర్ వీరన్న, అతని భార్య, బిడ్డను కలిసి హైద్రాబాద్‌కు వెళ్లిపోయారు



## భద్రాద్రి జిల్లాకు రాష్ట్ర స్థాయి సంపూర్ణత అభియాన్ అవార్డు..

* **గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ కలెక్టర్ జితేష్ వి. పాటిల్..**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: వెనుకబడిన జిల్లాల ప్రగతికి కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్ తీసుకొచ్చిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో అభివృద్ధి సూచికలన్నింటినీ సమర్థంగా సాధిస్తూ రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా రాజ్ భవన్‌లో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలోరాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, రాష్ట్ర రవాణా శాఖ మరియు బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కు అవార్డు ప్రధానం చేశారు. నీతి అయోగ్ ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధిలో భాగంగా విద్య, ఆరోగ్యం, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతులు, సామాజిక సంక్షేమం వంటి ఆరు ముఖ్య సూచికలపై 100 శాతం అభివృద్ధి లక్ష్యంగా సంపూర్ణత అభియాన్ కార్యక్రమం చేపట్టబడింది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఈ ఆరు సూచికలలో మూడు సూచికలపై శాతం సంపూర్ణత సాధించి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అంతేకాక, గుండాల మండలం బ్లాక్ స్థాయిలో ఐదు సూచికలను విజయవంతంగా పూర్తి చేసి ఆకాంక్షిత బ్లాక్‌లలో అగ్రస్థానంలో నిలిచింది. నీతి ఆయోగ్ అధికారి బృందాలు చేసిన సమీక్షల ఆధారంగా జిల్లా స్థాయిలో భద్రాద్రి కొత్తగూడెం ను అవార్డు కోసం ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం జిల్లాలోని అధికార యంత్రాంగం, మండల అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది మరియు ప్రజల చొరవకు గుర్తింపుగా నిలిచింది అని అన్నారు. ప్రతి గ్రామానికీ అభివృద్ధి కల్పించాలన్న సంకల్పంతో అన్ని శాఖలు సమన్వయంతో పని చేశాయి అని, ప్రతి సూచికపై కట్టుదిట్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లడం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు.ఈ అవార్డు మాకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. అభివృద్ధిలో స్థిరత్వం ఉండాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం. ముందుగానే ప్రణాళికలు రూపొందించి, సమర్థవంతంగా అమలు చేస్తే మరింత ప్రగతి సాధించవచ్చు అన్నారు. భవిష్యత్తులో జిల్లా మరిన్ని రంగాల్లో ఆదర్శంగా నిలబడేలా చర్యలు కొనసాగుతాయని కలెక్టర్ తెలిపారు..

## వ్యాపారం చేస్తున్న ఐవీఎఫ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

* **రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా**

అందోలు, ప్రజాస్ఫూర్తి: మాతృత్వం కోసం తపిస్తున్న దంపతుల ఆశను ఆసరాగా చేసుకుని, ఐవీఎఫ్, సరోగసిని వ్యాపారంగా మార్చి దందాకు పాల్పడుతున్న ఐవీఎఫ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. సృష్టి తరహా ఘటనలు పునరావృతం అవకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐవీఎఫ్ క్లినిక్‌లలో తనిఖీలు, నియంత్రణ కోసం ఉన్నతాధికారులతో కమిటీని నియమించాలని హెల్త్ సెక్రటరీకి మంత్రి సూచించారు. ఈ మేరకు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ నేతృత్వంలో ఆరోగ్యశ్రీ సీఈవో, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ సభ్యులుగా కమిటినీ నియమిస్తూ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ కమిటీ



నేతృత్వంలో ప్రైవేటు ఐవీఎఫ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించనున్నారు. ఆయా సెంటర్లపై ఇదివరకే నమోదైన కేసుల వివరాలు సేకరించనున్నారు. ఆయా సెంటర్ల అనుమతులు, రిజిస్ట్రేషన్ల వ్యాలిడిటీ వంటి అంశాలను పరిశీలించనున్నారు. ఈ ప్రక్రియను పది రోజుల్లో పూర్తి చేసి, నివేదిక అందించాలని కమిటీని ప్రభుత్వం ఆదేశించింది.

## తాటికల్లు @ 365 రోజులు





* **ఇది ఎక్కడో తెలుసా..?**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: తాటికల్లు తాగినట్టు... రిమ్మ రిమ్మ తిరిగినట్టు...' అంటూ సాగే జానపద పాటలెన్నో తెలంగాణ ప్రజలకు కిక్కునిస్తాయి. ఇంటికి చుట్టాలొచ్చింద్రంటే 'తాటికల్లు..యాటమాంసం'తో అతిధి మర్యాదలు చేయాల్సిందే. తెలంగాణ సాంప్రదాయంలో ఒక భాగమైన తాటికల్లు అంటే అందరికీ ఎండాకాలమే గుర్తుకొస్తుంది. పొద్దుగూకేవేళ లేదా.... పొద్దుపోయేవేళ తాటిచెట్టు కింద కూర్చుని మట్టికుండలో చల్లని తాటికల్లు నింపుకుని పక్కనే గుడాలద్దుకుంటూ గుటక వేస్తూ తాటికల్లు తాగడం చూస్తుంటాం. కాని ఇక్కడ మాత్రం ఒక్క ఎండాకాలమే కాదు... వానాకాలం, చలికాలం కూడా అంటే ఏడాది పొడవునా... 365 రోజులూ తాటికల్లు దొరుకుతుంది. అదికూడా అన్ని చెట్లకు కాదు మరి... ఈ ఒక్కచెట్టుకే అది సాధ్యం. అందుకే అది ప్రత్యేకం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టిపంపుల గ్రామంలోని ఓ వ్యవసాయ పొలంలో ఉన్న పలగాని నాగేశ్వరరావుకు సంబంధించిన ఒక తాటిచెట్టు ఎంతో ప్రత్యేకమైంది. ఏడాది పొడవునా ఈ తాటిచెట్టుకు ఆ గౌడన్న తన తల్లిపేరుతో పలగాని 'రత్తమ్మ' చెట్టుగా నామకరణం చేశాడు. ఈ సందర్భంగా పలగాని నాగేశ్వరరావు మాటల్లో చెట్టు గురించి... 'ఈ చెట్టు నుండి వచ్చే కల్లు ఎంతో రుచిగా ఉంటాయి. ప్రతిరోజు ఈ చెట్టు నుంచి కల్లు తీస్తాను. ఒకప్పుడు మా కొడుకు ఈ చెట్టుని తొలగించాలని జెసిబితో నెట్టుతుండగా నేను వద్దని చెప్పి ఆ చెట్టును కూల్చకుండా అడ్డుపడ్డాను. నాటినుండి నేటి వరకు ఆ చెట్టు నుంచి ప్రతిరోజు కల్లు తీస్తూనే ఉన్నాను. పక్కనే మరో తాటి చెట్టు ఉంది. ఆ చెట్టుకు మా నాన్న పేరు పెడతాను. దీంతూ మా అమ్మనాన్నల పేర్లతో చెట్లు పక్కపక్కనే ఉంటాయి.' అని ఆనందం వ్యక్తం చేశాడు.

## నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసా కల్పిస్తూ ఆదుకుంటుంది

* **సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ**



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసా కల్పిస్తూ ఆదుకుంటుందని సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సూరారం డివిజన్ నెహ్రూ నగర్ కు చెందిన మహమ్మద్ ఉజైర్ కి రూ.2లక్షలు , సంజయ్ గాంధీ నగర్ కు చెందిన మహేష్ కుమార్ పట్నాయక్ కు రూ. 1 లక్ష విలువగల ఎల్ ఓసీ చెక్కులను ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ చొరవతో సీఎంఆర్ఎఫ్ నిధుల ద్వారా మంజూరు చేయించి స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సీఎం సహాయనిధి ఆపత్కాలంలో అండగా నిలుస్తుందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట సంజీవిని అని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, సిద్ధికి, ప్రభుదాస్, రవి పాల్గొన్నారు.

## మౌలిక వసతుల పునరుద్ధరణకు తగిన సహకారాన్ని అందిస్తాం

* **బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : షాపూర్‌నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో అవసరమైన మౌలిక వసతుల పునరుద్ధరణకు తగిన సహకారాన్ని అందిస్తామని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ హామీ ఇచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని షాపూర్‌నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కోసం శనివారం వైద్యాధికారి డా. నవనీత, ఎంపీహెచ్డబ్ల్యుఎఫ్ , ఎఎన్ఎం సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో మౌలిక వసతుల మరమ్మతులు, ఆధునీకరణ అవసరాలను ఆమె వివరించారు. గతంలో పానీం, ఫర్నిచర్, మరుగుదొడ్లు, ఇతర వసతుల అభివృద్ధికి ఎమ్మెల్యే తన స్వంత నిధులతో సహాయపడ్డారని ఆమె గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం అవి పాక్షికంగా ధ్వంసమై మరమ్మతులకు అవసరం ఏర్పడిందని తెలిపారు. విషయాన్ని సమగ్రంగా పరిశీలించిన ఎమ్మెల్యే ప్రజారోగ్యం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని పేర్కొంటూ,. భవిష్యత్‌లో ఆసుపత్రి సేవలు మరింత మెరుగవడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలియజేశారు ప్రాథమిక వైద్య సేవల పునరుద్ధరణకు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తా

* **ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ప్రజాస్ఫూర్తి , కాప్రా :ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. శనివారం హబ్సీగూడ డివిజన్ పరిధిలోని రామ్రెడ్డి నగర్ స్ట్రీట్ నంబర్ 3, 4, 5 ల్లో ముప్పైరెండు లక్షల విలువైన యు జి డి పునర్నిర్మాణ పనులు, అలాగే ఎస్ ఎస్ నగర్లో ఐదు లక్షల వ్యయంతో మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్తో కలిసి త్రాగునీటి పైప్లైన్ పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలకు జరిగే ఏ సమస్యను వెంటనే గుర్తించి పరిష్కరించేలా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చేతన, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# మా ప్లాట్లను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారు..

* **అధికార పార్టీ నాయకుల పేర్లతో బెదిరింపులు...**

మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి :ఫోర్జరీ పత్రాలతో మా ప్లాట్లను కబ్జా చేయడానికి కొందరు వ్యక్తులు ప్రయత్నాలు చేస్తున్నారని విష్ణుపురి,శ్రీపాద కాలనీ ప్లాట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్‌లో బాధితులు విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విష్ణుపురి,శ్రీపాద కాలనీలో సర్వేనెంబర్ 79/ఆ,124ఆ,125/ఆ,126/ఆ,122/ఆ లో భూ యజమానుల నుండి పోగుల నరసింహారెడ్డి జిపిఏ తీసుకున్ని ప్లాట్లు చేసి అమ్మగా మేము ప్లాట్లను కొనుగోలు చేశాము. వాటికి ప్రభుత్వ నిబంధనల మేరకు ఎల్ఆర్ఎస్, మున్సిపల్ పర్మిషన్ తీసుకొని నిర్మాణం చేసుకోవడానికి మేము మా స్థలం దగ్గరకు వెళ్లగా జమాల్, కాశీం భూ యజమానులతో కొంతమంది తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకొని గుండాలతో చంపుతామని బెదిరించి మాపై దౌర్జన్యం చేస్తుండగా 100కు కాల్ చేసి పోలీసులను ఆశ్రయించగా మొబైల్ వాహనంలో వచ్చిన పోలీసులు అక్రమార్కులకే వత్తాసు పలికి వారికే సహకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికి పలుమార్లు పిఎస్ లో ఫిర్యాదు చేసి కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకున్నారని పోలీసులు వారికే వత్తాసు పలుకుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా మాకు ప్రభుత్వం జోక్యం చేసుకుని న్యాయం చేసి మా ప్లాట్లను మాకు దక్కేలా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,తోట శ్రీనివాస్ రెడ్డి, ధర్మారావు,కె వెంకటయ్య, రామారావు, జె.యన్.గౌడ్, ఎస్. సుజాత తదితరులు పాల్గొన్నారు.

**ఆరోపణలు అవాస్తవం- మేడిపల్లి సీఐ అర్ గోవింద్ రెడ్డి**

స్థలం వివాదం విషయంలో మేం ఎవరికి మద్దతు ఇవ్వలేదు ఘర్షణ వాతావరణం రాకుండా ఇతరులకు ఇబ్బంది కలుగకుండా పరిష్కారం చేసుకోవాలని ఇరు వర్గాలకు చెప్పటం జరిగింది. ఈ విషయంలో మాకు ఎవరి వత్తిడి లేదు మేం చట్టపరంగా మా విధులను సక్రమంగా నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు.

## దేశ అభివృద్ధిలో యువత పాలుపంచుకోవాలి

* **సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్**




ఉప్పల్, (ప్రజాస్ఫూర్తి) : దేశ అభివృద్ధిలో యువత పాలుపంచుకోవాలని సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్ సూచించారు. శనివారం ఉప్పల్ జిహెచ్ఎంసి సర్కిల్ ఆఫీస్ నందు "మేరా యువభారత్" రంగారెడ్డి జిల్లా విభాగం ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య పథకాలపై వర్క్ షాప్ ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేణుగోపాల్ హజరై మాట్లాడుతూ డిగ్రీ చదువుతున్న విద్యార్థులు, పూర్తి చేసినటువంటి విద్యార్థులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు చేపడుతున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెట్విన్ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలను వివరిస్తూ తద్వారా వారికి కావలసిన ఉపాధి అవకాశాలను సులభంగా పొందవచ్చునని అన్నారు. యువతకు ఉపయోగపడే వివిధ రకాల పథకాలను గురించి వివరించారు, జిల్లా యువజన అధికారి టి. ఐజయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వివిధ ముఖ్య పథకాలను , వాటి యొక్క ఉపయోగాలను యువతకు వివరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధికారులు డిఆర్డిఎ డపియం ఆనంద్. సెర్ప్ ద్వారా యువత కిషోర సంఘాలను ఏర్పాటు చేసుకోవలని సుచించారు. ఎల్డిఎం శివ ప్రసాద్ ఎంఎస్ఎంఇ ల గురించి, పై చదువులు, ఉద్యోగం, స్వయంఉపాదుల అవగాహనా విషయాన్ని వివరించారు. ఎం మాధురి డిఐసి ద్వారా జరుగుతున్న కార్యక్రమాలు వివరించారు. రమేష్ కేంద్ర ప్రభుత్వ పథకాలపై యువతకి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ సూపర్వైజర్ వెంకట రావు. అక్షయ్ డిఐసి. దివాకర్ డిఆర్డిఏ. ఉప్పల్, ఘట్కేసర్. మల్కాజిగిరి. వివిధ కళాశాలల విద్యార్థులు. యువకులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు విశ్వనాథ్ కుమార్, మై భారత్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాలనీల, బస్తీలకు అభివృద్ధికి కృషి చేస్తా

* **కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనిల్ రెడ్డి**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల, బస్తీలకు అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనిల్ రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని ఉజ్జయిని మహంకాళి నగర్ అసోసియేషన్ ఆఫీస్ అభివృద్ధి కోసం 50 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో డివిజన్లో వారీగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని డివిజన్ అభివృద్ధి విషయంలో తన వంతు పాత్ర ఉంటుందని తెలియజేశారు.

## బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న భాజపా: పొన్నం

* **42% సాధించాకే 'స్థానిక' ఎన్నికలకు వెళ్తామని స్పష్టీకరణ**



అంబర్‌పేట : రాష్ట్ర శాసనసభలో బీసీ రిజర్వేషన్లకు మద్దతునిచ్చిన భాజపా... అనంతరం ముస్లింల పేరిట వాటిని అడ్డుకుంటోందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. శనివారం హైదరాబాద్ అంబర్‌పేటలో జరిగిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పొన్నం మాట్లాడుతూ... 'బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు శాసనసభలో చట్టం చేసి గవర్నర్ ద్వారా రాష్ట్రపతి ఆమోదానికి పంపి చిత్తశుద్ధిని చాటుకున్నాం. రాష్ట్రపతి ఆమోదం పొందాల్సిన బిల్లును భాజపా అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. బీసీ రిజర్వేషన్లను సాధించిన తర్వాతే తమ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తుంది' అని ఆయన పేర్కొన్నారు. భారాస ఎమ్మెల్యే వెంకటేశ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, కాంగ్రెస్ నేతలు వి.హనుమంతరావు, రోహిన్‌రెడ్డి, తొలుపునూరి కృష్ణాగౌడ్, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.





## రైతు సంక్షేమమే
# మా ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

* **ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య**

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు : రైతు సంక్షేమమే మా ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య అన్నారు. ఇల్లందు నియోజకవర్గం,కామేపల్లి మండల పరిధిలో గల రైతు వేదిక నందు వ్యసాయ శాఖ అధికారుల అధ్వర్యంలో భూమి,విత్తనాలు,పంట బుణాలు,పంట భీమా,మార్కెటింగ్ కు సంబంధించిన రైతు చట్టాలపై సాగు న్యాయ యాత్ర నిర్వహకులు భూమి సునిల్ చే నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో రైతులందరు సంతోషంగా ఉంచాలనేదే మా అంతిమ లక్ష్యమన్నారు. ధరణితో రైతులు ఎమ్మార్వో ఆఫీస్ ల వద్ద పడిగాపులు కాసిన సంధర్భాలు కోకోళ్ళలన్నారు. రాష్ట రైతాంగానికి ఎన్నికల సమయంలో మాట ఇచ్చాం,భూ భారతి తీసుకువచ్చామన్నారు. రైతు చట్టాలను వారి చుట్టాలుగా చేసేందుకు క్రృషి చేస్తున్న భూమి సునిల్ కి ఎమ్మెల్యే కనకయ్య అభినందనలు తెలిపారు. నకిలి విత్తనాలు అరికట్టాడానికి మన ప్రజా ప్రభుత్వం రైతు కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణ రాష్ట రైతు కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గొపాల్ రెడ్డి మాట్లాడుతూ నకిలి విత్తనాల వలన నష్టపోయిన రైతులకు కంపెనీల వద్దనుండి పరిహారం ఇప్పించామన్నారు. సెంద్రీయ వ్యవసాయం పై రైతులు అందరు ద్రృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు, రైతు కమిషన్ సభ్యులు,మార్కెట్ కమిటి డైరెక్టర్ మాళోత్ బావుసింగ్,ఆత్మ కమిటి డైరెక్టర్ దమ్మాలపాటి సత్యనారయణ,రైతులు,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.



# కాళేశ్వరంలో దోషి కేసీఆర్..

* **తెల్చేసిన కాళేశ్వర కమీషన్...**
* **వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలిచి మరోసారి అధికారంలోకి వస్తాం**
* **కీలక వ్యాఖ్యాలు చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్...**
* **దేశ సంపదను బీజేపీ ఉన్నత వర్గాలకు దోచిపెడుతోంది ..**
* **ఏఐసీసీ రాష్ట్ర ఇంచార్జీ మీనాక్షి నటరాజన్...**

అందోలు, ప్రజాస్ఫూర్తి: కాళేశ్వరం ప్రాజేక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిలో కేసీఆర్ దోషి అని జస్టిస్ ఘోష్ ఆధ్వర్యంలోని కాళేశ్వరం కమిషన్ తేల్చి చెప్పిందని పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యాలు చేశారు. జనహిత పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అందోలు మండలం సంగుపేట వద్దనున్న లక్ష్మిదేవీ గార్డెన్స్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రాజెక్ట్ పేరుతో లక్షల కోట్ల రూపాయలు వృధా చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని కమిషన్ తేల్చి చెప్పిందన్నారు. ఇంజనీర్లు చెప్పింది కేసీఆర్ వినకుండా తన సొంత లాభం మాత్రమే చూసుకున్నారని ఆరోపించారు. తనకి ఇష్టం ఉన్న చోట ప్రాజెక్ట్ కట్టాలని కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారన్నారు. ప్రాజెక్టు కూలితే రెండే పిల్లర్లు కుంగాయని కేటీఆర్ అంటున్నారు. ఇది సామాన్య విషయమా..? ఈ కార్ రేస్ లో కేటీఆర్ అవినీతికి పాల్పడలేదా..? ప్రభుత్వ సొమ్ము తిన్న వాళ్ళు కక్కక తప్పదన్నారు. ఇతర ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకున్న నియోజకవర్గాల్లో ఇబ్బందులు ఉన్నాయన్నారు. ప్రతిపక్షాలు చేసిన కుట్రలతోనే ఇలా చేయాల్సి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూపులు ఉండడం సహజమన్నారు. పార్టీలో గ్రూపులు ఉండాలి కానీ పార్టీకి నష్టం కలిగేలా ఉండకూడదన్నారు. కాంగ్రెస్ పార్టీలో గొప్పతనం ఏంటంటే గ్రూపులు ఉండడమని, ఎన్ని గ్రూపులు ఉన్నా ఎన్నికలు వచ్చేసరికి అందరూ ఒక్కటై పార్టీ కోసం పోరాడాలన్నారు. గ్రూపుల వల్ల పార్టీకి నష్టం జరగకుండా చూసుకునే బాధ్యత మాపై ఉందన్నారు. పార్టీలో పాత నీరుతో పాటు కొత్త నీరు కూడా ఉండాలి. పాత కొత్త కలయికలతో పార్టీ ధృఢంగా ఉంటుందన్నారు. కేసీఆర్ తన స్వలాభం కోసం రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్లు అప్పుల ఊబి నెట్టరన్నారు. చేసిన అప్పులకు యేటా రూ.6500 కోట్ల వడ్డీని చెల్లిస్తున్నామని, కానీ ఆర్థికపరమైన ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను మాత్రం ఆపడం లేదన్నారు.. అడ్డుకున్నట్లు తెలిపారు.మీ చేతకానితనం వల్ల బనకచర్ల ప్రాజెక్ట్ వస్తోందన్నారు.ప్రాజెక్టు నిర్మాణం ఆపాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి అడ్డుకున్నట్లు తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు సమూచిత స్థానం కల్పిస్తామన్నారు.

**దేశ సంపదను బీజేపీ ఉన్నత వర్గాలకు దోచిపెడుతోంది..**

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పేదల సంక్షేమం పక్కన పెడితే ఉన్నత వర్గాలకు దేశ సంపదను ఉన్నత వర్గాలకు కట్టబేడుతుందని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ అన్నారు. బిజెపి పేదల ఓట్లు తొలిగిస్తుందన్నారు. బీహర్ రాష్ట్రంలో 65 లక్షల ఓట్లను తొలగించారని, దొంగచాటుగా గెలిచేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని ఆమె ఆరోపించారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు దేశ ద్రోహం కంటే ఎక్కువన్నారు. దేశం కోసం గాంధీ పాదయాత్ర చేసిన విధంగానే తాము కూడా జనహితం కోసమే పాదయాత్రను చేపడుతున్నామన్నారు. నాయకులు కూడా ప్రజల్లోకి నేరుగా వేళితేనే సమస్యలు తెలుస్తాయని, వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. బీసీలకు 42 శాతం కల్పించేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు సీఎంతో సహా ఢిల్లీలో మూడు రోజుల పాటు ధర్నా చేపడుతున్నామన్నారు. దేశానికి తెలంగాణ రాష్ట్రం రోల్ మోడల్‌గా నిలిచేలా పాలన కొనసాగుతుందన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు బీజేపీ చేతిలో కీలు బోమ్మలుగా మారాయని ఆమె ఆరోపించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ, ఎంపీ సురేష్ షేట్కార్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, రాజనర్సింహ ఫౌండేషన్ చైర్ పర్సన్ త్రిష రాజనర్సింహ, సంగారెడ్డి, మెదక్ గ్రంథాలయ సంస్థ చైర్మన్‌లు అంజయ్య, సువాసిని రెడ్డి, మహిళా నాయకురాలు గిరిజా షేట్కార్, తో పాటు తదితరులు ఉన్నారు.

## మధ్యవర్తిత్వం , బాల్య వివాహం పథకంపై న్యాయ అవగాహనా సదస్సు

ప్రజాస్ఫూర్తి , కాప్రా : తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మేడ్చల్ మల్కాజిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా మధ్యవర్తిత్వం , బాల్య వివాహం పథకాలు పై అవగాహనా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, చైర్పర్సన్ ఎస్ ఎన్ శ్రీదేవి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ సామ్ కోషి, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి మరియు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, ప్రధాన అతిథిగా పాల్గొని మధ్యవర్తిత్వం , బాల్య వివాహ నిషేధ పథకాల ప్రాముఖ్యతను ప్రసంగించారు. అధికార సంస్థ సభ్యులు సి. ఎచ్. పంచాక్షరీ, మెంబర్ సెక్రటరీ కూడా కలిసి మధ్యవర్తిత్వం, బాల్య వివాహ నివారణ పథకాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి బి. తిరుపతి, సెక్రటరీ/ సీనియర్ సివిల్ జడ్జి డి. కిరణ్ కుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అమరేందర్ రెడ్డి, బార్ అసోసియేషన్ సభ్యులు, ఇతర న్యాయమూర్తులు, ఆశ కమిటీ సభ్యులు, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, మధ్యవర్తిత్వం నిర్వహించే న్యాయవాదులు , నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సదస్సు ద్వారా జనం మధ్య మధ్యవర్తిత్వ విధానాల గురించిన అవగాహన పెంపొందించటంతో పాటు బాల్య వివాహం నివారణపై చర్యలు తీసుకోవడం ముఖ్యమని తెలిపారు.

## 13న జరగబోయే చేయూత పెన్షన్ దారుల మహా గర్జన విజయవంతం చేయాలి

* **మేడ్చల్ జిల్లా ఇన్చార్జి సూరిపాక వాసుదేవరావు మాదిగ**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఆగస్టు 13న జరగబోయే చేయూత పెన్షన్ దారుల మహా గర్జన విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా ఇన్చార్జి సూరి పాక వాసుదేవరావు మాదిగ పిలుపునిచ్చారు. శనివారం లూయిస్ బ్రెయిలీ భవన్ లో డిజేబుల్ అసోసియేషన్ వారితో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్నటువంటి వృద్ధులు వితంతులు ఒంటరి మహిళలు బీడీ కార్మికులు హెచ్ఐవి బాధితులు బోదకాలు ఇబ్బంది పడుతున్న పెన్షన్ దారులకు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టినట్టు 4000 వేలు అలాగే 6000 వేలు పెన్షన్ ప్రభుత్వం ఏర్పాటైన కాడి నుంచి ఆగస్టు మొదటి వారంలోనే చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ పార్టీ ఉపాధ్యక్షులు రాస మల్ల యాదగిరి మాదిగ, జి అంజయ్య, జి యాదయ్య, యు అంజయ్య, వి.వి రామయ్య, బిజెపి నాయకులు మహేష్, జి పెంటయ్య, సంగీ, మహేష్ మాదిగ, కల్మూరి కురుమయ్య, మట్ట నరసింహులు, జి కురుమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులలో న్యాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

* **ఆర్మీ మేజర్ జనరల్ ఎన్. శ్రీనివాస్ రావు**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థులలో న్యాయ కత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఆర్మీ మేజర్ జనరల్ ఎన్. శ్రీనివాస్ రావు అన్నారు. బాలానగర్ రాడిక్లఫ్ స్కూల్ నందు 20252026 అకాడమిక్ ఇయర్ హెడ్ బాయ్ కోసం జరిగిన ఎన్నికల్లో ఆ స్కూల్ లో పదవతరగతి చదువుతున్న రాఫెల్ రిత్విక్ స్కూల్ హెడ్ బాయ్ గా అత్యధిక మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా పొలిటికల్ అనలిస్ట్ రేఖా రావు, ఆర్మీ మేజర్ జనరల్ ఎన్. శ్రీనివాస్ రావు సమక్షంలో పదవీ స్వీకరణ జరిగింది.ఈ సందర్భంగా హెడ్ బాయ్ రాఫెల్ రిత్విక్ తోటి స్కూల్ పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ నేను ఇదే స్కూల్ లో నర్సరీ నుండి చదువుతున్నాను , ఈ స్కూల్ పరిస్థితుల పట్ల పూర్తి అవగాహనతో మీకు నేను మాట ఇస్తున్నానన్నారు. మీకు అకాడమిక్, స్పోర్ట్స్,కల్చరల్ , స్కూల్ సౌకర్యాలలో ఎటువంటి సమస్యలు ఉన్నా ఇంకా ఏమన్నా కొత్తగా చేయాలన్నా ఆ విషయాలను నా దృష్టికి తీసుకువస్తే నాకు స్కూల్ లో ఉన్న టీచర్స్ , అడ్మిన్ సిబ్బందితో మంచి సంబంధాలు ఉండడం వలన నా దృష్టికి వచ్చిన మీ ఏ సమస్యను అయినా పరిష్కరించగలను అని మాటిస్తున్నాను అని చెప్పాడు.ఈ పదవీ స్వీకరణ మహోత్సవానికి ప్రిన్సిపాల్ మాధవి తో పాటు స్కూల్ సిబ్బంది పాల్గొని ఎన్నికయిన హెడ్ బాయ్ రాఫెల్, హెడ్ గర్ల్ మోనిష , హౌస్ కెప్టెన్లు ,వైస్ కెప్టెన్స్ ను అభినందించారు.

# ఆపరేషన్ సింధూర్ గురించి ట్రంప్ వ్యాఖ్యలపై దేశ ప్రజలకు మోడీ సమాధానం చెప్పాలి

* **విలేకరుల సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఆపరేషన్ సింధూర్ తర్వాత భారత్ పాకిస్తాన్ యుద్ధ విరమణ విషయంలో పదేపదే యుద్ధం నేనే ఆపేనంటున్న ట్రంప్ వ్యాఖ్యలపై భారత ప్రధాని నరేంద్ర మోడీ ఈ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా వర్క్ షాప్ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ పాకిస్తాన్ యుద్ధం నేనే ఆపేనని పదేపదే చెబుతున్నప్పటికీ అది అబద్ధమని రెండు దేశాల మధ్య సమస్యను మేమే పరిష్కరించుకుంటామని అమెరికా జోక్యం తగదని చెప్పడానికి ప్రధాని మోడీకి నోరు రావట్లేదని ఆయన విమర్శించారు. పార్లమెంటులో ప్రతిపక్షాలు కూడా ట్రంప్ జోక్యం ఉందా లేదా అనే ప్రశ్నకు మోడీ సమాధానం చెప్పకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. ఇటీవల భారత్ పై సుంకాలు విధిస్తామని చెప్పినప్పటికీ అమెరికా విషయంలో నోరు మెదపడం లేదని మరోవైపు బ్రిటన్ కూడా వాణిజ్య ఒప్పందం పేరుతో సుంకాళి విధిస్తుంటే మాట్లాడడం లేదని ఆరోపించారు. భారత వ్యవసాయ రంగాన్ని అమెరికాకు అప్పచెప్పే చీకటి ఒప్పందానికి మోడీ ట్రంప్ తో స్నేహబంధం కొనసాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. మైనార్టీల మీద కక్ష సాధింపుకే బీహార్ లో ఓటర్ల రివిజన్ ప్రక్రియ ముందుకు తీసుకొచ్చారని కేవలం ఇది బీహార్ కు మాత్రమే పరిమితం కాదని అన్ని రాష్ట్రాల్లో జరిగే ప్రమాదం ఉందనీ అన్నారు. ఓటర్ల రివిజన్ ఉపయోగించి ముస్లింలను తగ్గించాలని చూసిందనీ విమర్శించారు. ఓటర్ల రివిజన్ పై సుప్రీంకోర్టు ఇచ్చిన సూచనను పాటించాలని ఆయన డిమాండ్ చేశారు. పహల్గాం దాడులను బిజెపి రాజకీయాల కోసం వాడుకుందనీ, దేశంలో ప్రతి అంశాన్ని మతకోణంలో చూస్తున్నారని ప్రజల మధ్య మత వైషమ్యాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. చరిత్రను వక్రీకరించి చరిత్రలో దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలను హిందూ ముస్లిం పోరాటాలుగా చిత్రీకరించడం, చరిత్రను కూడా ఉత్పత్తి సంబంధాలు ఆధారంగా కాకుండా మతాల పేరుతో విశ్లేషిస్తున్నారని ఆరోపించారు. జాతీయ మీడియా బిజెపి భజన చేస్తున్నదాని అసలు విషయాలను కప్పిపెడుతుందనీ, మీడియా పూర్తిగా కార్పొరేట్ల కబంధ హస్తాల్లో ఉందని ఆరోపించారు. ఆపరేషన్ సింధూర్ పై గురించి మోడీ దగ్గర సమాధానం లేదనీ, పార్లమెంట్లో చర్చ జరగాలని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాగ్దానాలు అమలు చేస్తున్నప్పటికీ, పూర్తిస్థాయి లబ్ధిదారులకు చేరట్లేదని ఆరోపించారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు అందడం లేదనీ రాజకీయ పార్టీ నాయకులు చెప్పినవారికే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం సరైనది కాదనీ అన్నారు.

* **బిజెపికి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ నుండి పైన ఐదు పంచాయతీలు కలపాలి**
* **సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్**

అయోధ్యలో రాముడి కాదు భద్రాచలం రామాలయం అభివృద్ధి కూడా చూడాలనీ ఎద్దేవా చేశారు. భద్రాద్రి రాముడి పై వివక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పోలవరం నిర్మిస్తే భద్రాచలం మునగాక తప్పదనీ దీని రక్షించాల్సిన బాధ్యత ఉందనీ అన్నారు. పోలవరం ఇపుడున్న డిజైన్ ప్రకారం పూర్తి చేస్తే భద్రాది రాముని గుడి కూడా మునుగుతుందని దీనిపై బీజేపీ నాయకులు స్పందించాలని హితవు పలికారు. పై విషయాలపై బిజెపి రాష్ట్ర అధ్యక్షులు తమ ప్రభుత్వంతో మాట్లాడాలని రామచంద్రరావుకు సూచించారు. ఇవి వదిలేసి పిచ్చి ప్రేలాపనలు చేయడం వలన ఉపయోగం లేదని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాలుగు శంకుస్థాపనలు నాలుగు ప్రాజెక్టుల పేరుతో చేసినప్పటికీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చుక్క నీరు రాకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్టు పనులకు అరవై కోట్ల నిధులు కేటాయించి కేనాల్ నిర్మించినప్పటికీ నీరు పారడం లేదనీ, పదమూడు వేల కోట్ల బడ్జెట్ను పందొమ్మిది వేల కోట్లకు పెంచి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందనీ బడ్జెట్ పెరుగుతుంది తప్ప పనుల్లో ఎలాంటి అభివృద్ధి లేదని ఆరోపించారు. పూర్తి స్థాయిలో ప్రాజెక్ట్ నిర్మాణ పనులు చేసి భద్రాద్రి జిల్లాకు నీళ్లు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. లేకుంటే ఉమ్మడి జిల్లాతో పాటు, మహబూబాబాద్ జిల్లా ప్రజలను చైతన్యం చేసి ఆందోళన నిర్వహిస్తామన్నారు. అనంతరం స్థానిక సమస్యలపై వారం రోజులపాటు జిల్లాలో సిపిఎం నిర్వహించిన సమస్యల అధ్యయన యాత్రల వివరాలను సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు వివరించారు. తమ అధ్యయనంలో భాగంగా వచ్చిన స్థానిక సమస్యలపై దశలవారి పోరాటాలు చేస్తామని ముందుగా జిల్లాలో ఉన్న సమస్యలను కలెక్టర్కు వివరిస్తామని తెలియజేశారు. అధికారులు ప్రభుత్వ స్పందనను బట్టి భవిష్యత్తు పోరాటాలకు సిద్ధమవుతామని తెలియజేశారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజె రమేష్, సీనియర్ నాయకులు ఎలమంచిలి రవికుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, ఎం జ్యోతి, అన్నవరపు సత్యనారాయణ, కారం పుల్లయ్య, కే బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు తదితరులు పాల్గొన్నారు

## నా పేరే ఓటరు జాబితాలో లేదు : తేజస్వీ యాదవ్ కీలక ఆరోపణలు



పట్నా: బిహార్ శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా ముసాయిదాను ఎన్నికల సంఘం శుక్రవారం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై విపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. తాజాగా ఆర్జేడీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ స్పందిస్తూ.. ఈ ముసాయిదా జాబితాలో తన పేరే లేదని ఆరోపించారు. పట్నాలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "నా ఈపీఐసీ నంబరుతో ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో చెక్ చేశా. ఈ ముసాయిదా జాబితాలో నా పేరు కన్పించలేదు. ఇక నేను ఎన్నికల్లో ఎలా పోటీ చేయాలి? స్వయంగా బూత్ లెవల్ అధికారి నావద్దకు వచ్చి ఫామ్ తీసుకెళ్లారు. అయినా నా పేరు జాబితాలో లేదు" అని తేజస్వీ వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అనంతరం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి దాదాపు 20వేల నుంచి 30వేల వరకు ఓటర్లను తొలగించాలని ఆర్జేడీ (RJD) నేత ఆరోపించారు. మొత్తంగా రాష్ట్రంలో దాదాపు 65 లక్షల ఓటర్లను తొలగించారని పేర్కొన్నారు.

**తోసిపుచ్చిన ఈసీ..**

అయితే, తేజస్వీయాదవ్ చేసిన ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. ముసాయిదా జాబితాలో ఆయన పేరు ఉందని పేర్కొంది. అందుకు సంబంధించిన కాపీని కూడా విడుదల చేసింది. ఆర్జేడీ నేత బహుశా తన పాత ఈపీఐసీ నంబరుతో చెక్ చేసుకుని ఉంటారని, అందుకే ఆయన పేరు జాబితాలో కన్పించకపోయి ఉండొచ్చని ఈసీ తెలిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పూర్తవటంతో ఈసీ ఈ ముసాయిదా జాబితాను రూపొందించింది. జాబితా నుంచి 65 లక్షల మందిని తొలగించడంతో ఓటర్ల సంఖ్య 7.93 కోట్ల నుంచి 7.28 కోట్లకు తగ్గింది. దీనిపై అభ్యంతరాలు తెలిపేందుకు సెప్టెంబరు 1 వరకు ఈసీ గడువు కల్పించింది. బిహార్‌లో ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

## 'ప్రధాని మోదీ పేరు చెప్పాలని నాపై ఒత్తిడి తెచ్చారు'

: **మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్**



మాలేగావ్ పేలుడు కేసులో నిర్దోషిగా విడుదలైన భాజపా మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ కేసు విచారణ సమయంలో దర్యాప్తు అధికారులు వ్యవహరించిన తీరుపై విమర్శలు చేశారు. ప్రధాని మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పేర్లు చెప్పాలని తనపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. "భాజపా సీనియర్ నాయకుడు రామ్ మాధవ్ సహా పలువురి పేర్లు చెప్పాలని వారు నాపై ఒత్తిడి తెచ్చారు. నన్ను హింసించారు. నన్ను ఆసుపత్రిలో అక్రమంగా నిర్బంధించారు. నేను గుజరాత్‌లో నివసించడం వల్ల ప్రధాని మోదీ పేరు కూడా చెప్పించాలని చూశారు. నేను అబద్ధాలు చెప్పాలని వారు ప్రయత్నించారు. అవి అబద్ధాలు కావడంతో నేను ఎవరి పేరు చెప్పలేదు" అని ప్రజ్ఞ మీడియాతో మాట్లాడారు. మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసు విచారణ బృందంలో ఉన్న మాజీ ఏటీఎస్ అధికారి మహబూబ్ ముజావ్ కూడా ఇలాంటి ఆరోపణలే చేసిన సంగతి తెలిసిందే. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ను అరెస్టు చేయాలని అప్పట్లో తనకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా ఉన్న పరమ్‌బీర్ సింగ్‌తో పాటు మరికొంతమంది ఉన్నతాధికారులు ఈ ఆదేశాలను తనకు ఇచ్చినట్లు చెప్పారు. తనకు సాయం చేసేందుకు రాష్ట్రం నుంచి దాదాపు పది మంది సిబ్బందితో పాటు రివాల్వర్ కూడా జారీ చేశారని ముజావ్ తెలిపారు. అయితే, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించేందుకు నిరాకరించడంతో తనపై తప్పుడు కేసు పెట్టారన్నారు. ఆ తర్వాత వాటన్నింటిలో తాను నిర్దోషిగా బయటకు వచ్చినట్లు వెల్లడించారు. మహారాష్ట్ర లోని మాలేగావ్ ప్రాంతంలో 2008 సెప్టెంబరు 29న పేలుడు సంభవించింది. ఓ మసీదు సమీపంలో మోటార్ సైకిల్‌కు అమర్చిన బాంబు పేలడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 100 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ప్రజ్ఞా ఠాకూర్, పురోహిత్‌తో పాటు రమేశ్ ఉపాధ్యాయ్, అజయ్ రహీర్‌కార్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణి ప్రధాన నిందితులుగా కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వాదనలో చాలా లోటుపాట్లు ఉన్నాయని ఎన్ఐఏ కోర్టు తెలిపింది. "ఈ పేలుడుకు వినియోగించిన మోటార్‌బైక్.. మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ పేరు మీద రిజిస్టర్ అయిందని ప్రాసిక్యూషన్ చేసిన వాదనకు తగిన సాక్ష్యాధారాలు లేవు. బెనిఫిట్ ఆఫ్ డౌట్ మినహా ఈ కేసులో ఎలాంటి బలమైన ఆధారాల్లేవు" అని తీర్పు వెలువరించింది.

## ఆగస్టు 16 నుంచి రాష్ట్రపతి భవన్‌లో 'అమృత్ ఉద్యాన్' సందర్శన



రాష్ట్రపతి భవన్‌లోని అతి సుందరమైన 'అమృత్ ఉద్యాన్'ను ప్రజల సందర్శనార్థం ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 14వరకు ప్రవేశం కల్పిస్తున్నట్లు రాష్ట్రపతి భవన్ అధికారిక వర్గాలు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించాయి. ఉద్యానవనంలో ప్రవేశానికి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సందర్శకులకు అనుమతి ఇవ్వనున్నారు. నిర్వహణ నిమిత్తం అన్ని సోమవారాలు సెలవు ఉంటుందని రాష్ట్రపతి కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉద్యానవనంలో బాలవాటిక, హెర్బల్ గార్డెన్, బోన్సాయ్ గార్డెన్, సెంట్రల్ లాన్, సర్క్యులర్ గార్డెన్, లాంగ్ గార్డెన్ వంటివి సందర్శకులను ఆకర్షించనున్నాయి. అమృత్ ఉద్యాన్‌లోని ప్రతి మొక్కకు ఉన్న క్యూఆర్ కోడ్ సహాయంతో ఆ వృక్ష జాతి గురించి తెలుకోవచ్చు. అమృత్ ఉద్యానవనాన్ని సందర్శించాలనుకునేవారు రాష్ట్రపతి భవన్ అధికారిక వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. 35వ ప్రవేశద్వారం వద్దకు చేరుకున్నాక కియోస్కుల ద్వారా కూడా స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు. ఇక ఉద్యానవనంలోకి సందర్శకులు కేవలం మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ కీలు, హ్యాండ్ బ్యాగ్స్, వాలెట్స్, నీళ్ల బాటిల్స్, పిల్లల పాలసీసాలు, గొడుగు వంటివి మాత్రమే లోపలికి తీసుకెళ్లాలని అధికారులు సూచించారు. ఆగస్టు 29న జాతీయ క్రీడల దినోత్సవం, సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడాకారులకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక ప్రవేశ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

## గోవా పర్యాటక ప్రదేశాల్లో 'న్యూసెన్స్' చేస్తే.. రూ.లక్ష వరకు జరిమానా

గోవా పర్యాటక ప్రదేశాల్లో ఇబ్బందులు కలిగించే వారితోపాటు అనధికారిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి గోవా టూరిస్టు ప్లేసెస్ (ప్రొటెక్షన్ అండ్ మెయింటెనెన్స్) సవరణ బిల్లు 2025ను ఆమోదించింది. 'న్యూసెన్స్' అనే పదానికి విస్తృత నిర్వచనం ఇవ్వడంతోపాటు రూ.లక్ష వరకు జరిమానా విధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. అనధికార బోట్లను లేదా కాలుష్యానికి, ప్రమాదాలకు కారణమయ్యే తేలియాడే వస్తువులను ఆపరేట్ చేయడం, వస్తువులను కొనాలని పర్యటకులను ఇబ్బంది పెట్టడం, అనధికారిక ప్రదేశాల్లో మద్యం సేవించడం లేదా గ్లాసులను పగలగొట్టడం, బహిరంగ ప్రదేశాల్లో వంట చేసుకోవడం, చెత్త వేయడం, వాటర్ స్పోర్ట్స్ నిర్వహించడం లేదా అనధికారికంగా టికెట్లు, వస్తువులు అమ్మడం, భిక్షాటన చేయడం, బీచ్‌లలో వాహనాలను ఆపరేట్ చేయడం, అనుమతి లేకుండా రాష్ట్రం వెలుపల ఉన్న ప్రదేశాలకు పర్యటక సేవలు అందించడం వంటి వాటిని 'న్యూసెన్స్' నిర్వచనంలో చేర్చారు. టూరిస్టుల స్వేచ్ఛకు ఇబ్బంది కలిగించడాన్ని ఈ కొత్త చట్టంలో నేరంగా పరిగణించారు. సవరించిన సెక్షన్ 10 ప్రకారం నిబంధనలు ఉల్లంఘిస్తే కనిష్ఠంగా రూ.5వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించనున్నారు. అంతేకాదు ఈ జరిమానాలను ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు సమీక్షించే విధంగా చట్టంలో నిబంధనలు రూపొందించారు. సంబంధిత అధికారులు సిఫార్సుల మేరకు ప్రతి రెండేళ్లకు ఒకసారి వీటిని 10శాతం పెంచే అవకాశం కూడా కల్పించారు. పర్యటక ప్రదేశాల్లో ఎక్కడ చూసినా ఏజెంట్లేనని, అనధికార ప్రచార కార్యకలాపాలను అరికట్టడంలో ఈ బిల్లు ఓ ముందడుగు అని గోవా పర్యటక శాఖ మంత్రి రోహన్ ఖౌంటే పేర్కొన్నారు. టూరిస్టులకు రక్షణ, శాంతి భద్రతల కోణంలోనూ ఈ చర్యలు ఎంతో అవసరమన్నారు. టూరిస్టులకు ఇబ్బంది కలిగించే సంఘటనలు పెరుగుతుండటం, పర్యావరణానికి నష్టం కలిగించే ఉల్లంఘనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇలా పర్యటకులు, స్థానికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

## పాక్‌బంగ్లా వైమానిక దళ ఒప్పందం..? అప్రమత్తమైన భారత్

షేక్ హసీనా తన పదవి కోల్పోయిన తర్వాత తాత్కాలిక సారథి నేతృత్వంలోని బంగ్లాదేశ్ ప్రభుత్వంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. భారత్‌కు దూరం జరుగుతూ పాకిస్థాన్ అనుకూల వైఖరిని ప్రదర్శిస్తోంది. ఆ దేశంతో వాణిజ్య, స్నేహ సంబంధాలను ఏర్పరుచుకుంటోంది. మరోవైపు బంగ్లాదేశ్, పాకిస్థాన్ సైన్యాల మధ్య సంబంధాలు బలపడటాన్ని దిల్లీ గమనిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో భారత నిఘా వర్గాలకు కీలక సమాచారం అందింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వైమానిక దళ అధికారులు ఏప్రిల్ 15 నుంచి 19 వరకు రహస్య చర్చలు చేపట్టినట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో ఇస్లామాబాద్, ఢాకాల మధ్య సైనిక భాగస్వామ్యం వేగంగా అభివృద్ధి చెందుతున్నట్లు తెలుస్తోంది. ఈ రహస్య సమావేశంలో ఇరుదేశాల వైమానిక దళ చీఫ్‌లు డ్రోన్ యుద్ధం, వ్యూహాత్మక కమ్యూనికేషన్లు, అంతరిక్ష కార్యకలాపాలు, సైబర్ సెక్యూరిటీ సిస్టమ్, ప్రపంచ రాజకీయ పరిస్థితులు మొదలైన విషయాల గురించి చర్చించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా డ్రోన్ స్వార్మింగ్, అటానమస్ ఎయిర్ కంబాట్ సిస్టమ్‌లకు కీలకమైన మాడ్యులర్, అన్‌మ్యాన్డ్ మిషన్ ట్రైనర్స్ సిమ్యులేటర్‌ల ఉమ్మడి అభివృద్ధిపై వీరు ప్రధానంగా దృష్టిపెట్టినట్లు సమాచారం. కాగా చైనా సహాయంతో తన డ్రోన్ యుద్ధ సామర్థ్యాలను పాకిస్థాన్ మెరుగుపరుచుకుంటున్న విషయం తెలిసిందే. ఈ కార్యాచరణ పరిజ్ఞానాన్ని దాయాది దేశం ఢాకాకు కూడా బదిలీ చేస్తున్నట్లు భారత నిఘా వర్గాలు భావిస్తున్నాయి. బంగ్లాదేశ్ ఎలైట్ 1 పారా కమాండో బెటాలియన్‌కు ప్రత్యేక ఆయుధాలను బదిలీ చేయడం, బంగ్లా దళాలకు పాక్ సైనిక శిక్షణ ఇవ్వడానికి చర్యలు, పాక్ నుంచి అబ్దాలీ స్వల్పశ్రేణి క్షిపణులను, తుర్కియే నుంచి బంగ్లాదేశ్ యుద్ధ ట్యాంకులనూ కొనుగోలు చేయడం వంటి విషయాలపై ఇరుదేశాలు ఒప్పందాలు చేసుకున్నట్లు తెలుస్తోంది.

## బనకచర్లపై కాంగ్రెస్ ప్రభుత్వ ఆరోపణలు అర్ధరహితం

* **తెలంగాణను సస్య శ్యామలం చేసిన ఘనత కేసిఆర్ ది..**
* **మాజీ కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి..**

అందోలు, ప్రజాస్ఫూర్తి: సాగునీటి రంగంపై కనీస అవగాహన లేకుండా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బీఆర్ఎస్ పార్టీ పై అర్థం లేని ఆరోపణలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి హెచ్చరించారు. జోగిపేట లో జరిగిన కాంగ్రెస్ సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తో పాటు మాజీ మంత్రి హరీష్ రావు పై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన అబద్ధపు ఆరోపణలను ఖండిస్తూ ఆయన మీడియా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ పదేళ్ల పాలనలో మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించడంతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి లక్షల ఎకరాలకు సాగునీటిని అందించి బీడు వారిన భూములను సస్యశ్యామలం చేసిన చరిత్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు దక్కుతుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మధ్యలో వదిలివేసిన సింగూరు కాలువలకు జవసత్వం తీసుకొచ్చి ఆందోల్ నియోజకవర్గం లో చెరువులు నింపిన ఘనత మాజీ మంత్రి హరీష్ రావు దే అని అందోల్ నియోజకవర్గం లో ఏ పల్లెకు వెళ్ళిన ప్రజలు ఈ విషయాన్ని బహిరంగంగా చెప్తారని స్పష్టం చేశారు. ఆందోల్ నియోజకవర్గం పై ఇక్కడ రైతులపై నిజంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ హాయంలో మంజూరు చేసిన బసవేశ్వర సంగమేశ్వర ప్రాజెక్టులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కనుసనల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగుతుందని విమర్శించారు. చంద్రబాబు కు గురుదక్షిణ గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ వనరులను ఆంధ్రప్రదేశ్ కు దోచిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలబెడితే రెండేళ్ల పాలనలో తెలంగాణ వనరులను ఆస్తులను మళ్లీ ఆంధ్ర పెత్తందారులకు కట్టబెట్టిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. బనకచర్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు. తెలంగాణ ఉద్యమం చేసిన స్ఫూర్తితో బనకచర్ల విషయంలో మరొకసారి పోరాటాన్ని ఉధృతం చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న మోసాన్ని ప్రజల్లో ఎండగడుతామన్నారు. నీటి దోపిడీని ప్రజలతో కలిసి అడ్డుకుంటామన్నారు. ఇచ్చిన హామీలను విస్మరిస్తూ వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు వస్తాయని టిపిసిసి చీఫ్ కలలు కంటున్నారని కానీ 100 సీట్లలో ఆ పార్టీ డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమన్నారు. ఇప్పటికైనా బీ ఆర్ ఎస్ పార్టీ పై అబద్ధపు ప్రచారాలు చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తన పద్ధతి మార్చుకోని ఎన్నికలకు ముందు మీరు ఇచ్చిన హామీల అమలు విషయంలో దృష్టి పెట్టాలని లేదంటే ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

# కార్పొరేట్ స్థాయిలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్: తెలంగాణలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాలను నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాలుగు జిల్లాల్లో 9 ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ భవనాలు నిర్మించనున్నట్టు చెప్పారు. త్వరలో గచ్చిబౌలిలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకొచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ.. ప్రజలకు మరింత సమర్థంగా సేవలందించేందుకే మరో అడుగు ముందుకు వేస్తున్నట్లు వెల్లడించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పరిపాలనకు ఇబ్బంది లేకుండా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల



పునర్వ్యవస్థీకరణ, కొత్త భవనాల నిర్మాణం ఉండాలి. అంతిమంగా ప్రజల సంతృప్తే ప్రధానం అనే అంశాన్ని అధికారులు దృష్టిలో పెట్టుకోవాలి. ప్రస్తుతం రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా వాటిలో 37 మాత్రమే సొంత భవనాల్లో ఉన్నాయి. మిగిలినవన్నీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో దశలవారీగా నిర్మించాలని భావిస్తున్నాం. మొదటి విడతలో ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో 4 లేదా 5 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను భవిష్యత్తు అవసరాలను అనుగుణంగా ఒకే చోట ఇంటిగ్రేట్ చేసేలా భవనాన్ని నిర్మించాలని నిర్ణయించాం. ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని ఇందుకు అవసరమైన భూమిని గుర్తించాలి. ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వల్ల పనితీరు మెరుగుపడడమే కాకుండా పర్యవేక్షణ సులభమవుతుంది. అవినీతిని కూడా తగ్గించవచ్చు" అని పొంగులేటి అన్నారు.

## ఆగస్టు 4న ఓపెన్ ప్లాట్ల వేలం : రాజీవ్ స్వగృహ ఎండీ గౌతమ్



హైదరాబాద్: నగరంలోని బండ్లగూడ, నాగోల్‌లో ఖాళీగా ఉన్న రాజీవ్ స్వగృహ ఫ్లాట్లలో 401 ఫ్లాట్లను కేటాయించారు. ఇంకా మిగిలిన సింగిల్, డబల్ బెడ్ రూం ఫ్లాట్ల కోసం ఈనెల 8 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని రాజీవ్ స్వగృహ ఎండీ గౌతమ్ తెలిపారు. ఫ్లాట్ల కేటాయింపు ద్వారా రూ.78 కోట్ల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. బండ్లగూడలో కొన్నేళ్ల క్రితం 2,746 ఫ్లాట్లు నిర్మించగా.. అందులో 159 మిగిలాయి. వాటిని అమ్మేందుకు పలు మార్లు ప్రయత్నించినప్పటికీ.. ఫలించలేదు. బండ్లగూడలోని 159, పోచారంలోని 600 ఫ్లాట్లను నో లాస్.. నో ప్రాఫిట్ విధానంలో అమ్మేందుకు జులై 4న ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. దరఖాస్తులు స్వీకరించి ఒకే దరఖాస్తు వచ్చిన వారికి నేరుగా కేటాయించగా.. ఎక్కువ దరఖాస్తులు వచ్చిన ఫ్లాట్లను లాటరీ ద్వారా కేటాయించారు. ఈనెల 4వ తేదీ నుంచి ఓపెన్ ప్లాట్ల వేలం నిర్వహించనున్నట్లు గౌతమ్ వెల్లడించారు. 4న రంగారెడ్డి జిల్లా కుర్మగూడలో 20 ప్లాట్లు, 6న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బహదూర్‌పల్లిలో 69, రంగారెడ్డి జిల్లా తొర్రూరులో 100 ప్లాట్లు వేలం ద్వారా విక్రయించనున్నట్లు వెల్లడించారు.

# కేసులు, కొట్లాటలు నాకు కొత్తేమి కాదు

**: మంత్రి కొండా సురేఖ**

హైదరాబాద్: తనపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దాఖలు చేసిన పరువునష్టం కేసులో నాంపల్లి కోర్టు ఆదేశాలపై మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఈ కేసుకు సంబంధించి కాగ్నిజెన్స్ తీసుకొని ముందుకు వెళ్లాలని నాంపల్లి కోర్టు స్పష్టం చేసిందన్నారు. "ఈ దేశ న్యాయ వ్యవస్థపై అపారమైన గౌరవం ఉంది. ఈ కేసులు, కొట్లాటలు నాకు కొత్తేమి కాదు. నా జీవితమే ఒక పోరాటం. ఏ



కేసులోనైనా కోర్టు కాగ్నిజెన్స్ తీసుకోమని చెప్పడం సర్వసాధారణం. ఇది జరిగి రెండు రోజులైంది. అయితే, కొండా సురేఖ కేసులో సంచలనం.. బిగ్ బ్రేకింగ్.. అంటూ వార్తలు రాస్తున్నారు. ఈ విషయంలో కొందరి ఉత్సాహం చూస్తుంటే నాకు చాలా ఆశ్చర్యమేస్తోంది. కొండా సురేఖ పేరు వినగానే.. కొంతమంది రిపోర్టర్లు నా కేసులో కోర్టు తీర్పు ఇచ్చిందని మీడియా, సోషల్ మీడియాల్లో రాస్తున్నారు. ఇది వారి విజ్ఞతకే వదిలేస్తున్నా. చివరగా నేను చెప్పేది ఒకటే.. చట్టం తన పని తాను చేసుకుపోతుంది" అని మంత్రి పేర్కొన్నారు.

## ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు ఏపీ మంత్రులు చేయొద్దు

కొల్లాపూర్: గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ప్రభుత్వం వడ్డీలు కడుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన భారత రాష్ట్ర సమితి ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదన్నారు. కనీసం గతంలో కాంగ్రెస్ శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులను కూడా ఆ పార్టీ పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన ఆయన.. గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "కృష్ణా నదిపై భారత రాష్ట్ర సమితి ఒక్క ప్రాజెక్టు కూడా ఎందుకు కట్టలేదు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదు. ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ నిర్మించే ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయిన తర్వాత బనకచర్ల కట్టుకోవచ్చు. ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు ఏపీ మంత్రులు మాట్లాడకూడదు. తెలంగాణకు ద్రోహం చేసింది.. భారత రాష్ట్ర సమితి. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిల్లీ వెళ్లారు కాబట్టే బనకచర్ల ప్రాజెక్టు ఆగింది. ఏపీ మంత్రి లోకేశ్ తప్పుదోవ పట్టించే



వ్యాఖ్యలు చేయకూడదు. 2 లక్షల ఎకరాలు మునిగిపోకుండా పోలవరం కట్టుకోవచ్చు. ముంపు గ్రామాల ప్రజల తరపున పోరాడేందుకు మేం సిద్ధంగా ఉన్నాం." అని అన్నారు.

## దిల్లీలో రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: బీసీ జనాభా సేకరణను కాంగ్రెస్ గతంలో ఎందుకు చేయలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ఇంకా ప్రయత్నిస్తూనే ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక విధాలుగా తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలను పీఎం, సీఎంలను చేసిందా? అని ప్రశ్నించారు. నగరంలోని ఇందిరాపార్కు వద్ద భాజపా ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబీసీ మోర్చా మహాధర్నాలో కిషన్ రెడ్డి మాట్లాడారు. "బీసీలకు జనాభా సేకరణ తర్వాతే సామాజిక న్యాయం జరుగుతుంది. దిల్లీలో అనేక రకాలుగా సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి మాటలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. బీసీల గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే" అని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# బీసీల హక్కులను కాంగ్రెస్ పార్టీ కాలరాస్తోంది

**: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు**

హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కానీ బీసీ నేతను ముఖ్యమంత్రి చేశారా అని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించారు. నగరంలోని ఇందిరాపార్క్ వద్ద భాజపా ఓబీసీ మోర్చా మహాధర్నాలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీల పేరుతో రాజకీయం చేయాలని చూస్తోందని.. బీసీలకు ఎక్కడ ప్రాధాన్యమిచ్చిందని నిలదీశారు. తొమ్మిది మంది



కార్పొరేషన్ ఛైర్మన్లను నియమిస్తే ఒక్క బీసీ నేతకు మాత్రమే అవకాశమిచ్చారని విమర్శించారు. క్యాబినెట్‌లో కేవలం ముగ్గురు బీసీ మంత్రులు మాత్రమే ఉన్నారన్నారు. బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే.. 42 శాతం రిజర్వేషన్లు కేవలం బీసీలకు మాత్రమే ఇవ్వాలని, ఇతర మతాల వారిని కలపొద్దని డిమాండ్ చేశారు. బీసీల హక్కులను ఎంఐఎం పార్టీ హరిస్తోందని, కాంగ్రెస్ కాలరాస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీసీలు పోరాడాల్సిన అవసరముందన్నారు.

## సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసు.. మరో ఇద్దరు నిందితులను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్: సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసు నిందితులను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ఏ3.. విశాఖ సృష్టి కేంద్రం మేనేజర్ కల్యాణి, ఏ6.. ధనశ్రీ సంతోషి(అస్సాం)ను కస్టడీలోకి తీసుకున్నారు. ఉత్తర మండల డీసీపీ కార్యాలయానికి వారిని తరలించారు. ఇద్దరినీ 5 రోజుల కస్టడీకి ఇటీవల సికింద్రాబాద్ సివిల్ కోర్టు అనుమతించింది. వీరిని సరోగసీ వ్యవహారంలో పోలీసులు మరింత లోతుగా విచారించనున్నారు. అంతకుముందు ఈ ఇద్దరికి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లో సరోగసీ పేరుతో పలువురు దంపతులను మోసం చేసి డబ్బులు దండుకున్నారు. ఏజెంట్ల సాయంతో అస్సాంకు చెందిన మహిళల నుంచి పిల్లలను కొనుగోలు చేసి తీసుకొచ్చి దంపతులకు వారి బిడ్డగా అప్పగించారు. మరోవైపు నిబంధన లకు విరుద్ధంగా వీర్యం, అండాలు సేకరించి ఇతర రాష్ట్రాల్లో విక్రయించారు.

# పండుగలా కొనసాగుతున్న రేషన్ కార్డుల పంపిణీ..

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంతో పాటుగా హైదరాబాద్ జిల్లా లోని అన్ని నియోజకవర్గాలలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం పండుగల కొనసాగుతుందని, అదేవిధంగా అర్హతను బట్టి రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ ముషీరాబాద్ నియోజకవర్గంలోని కాశీష్ ఫంక్షన్ హాల్ లో పండుగల నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, జిహెచ్ఎంసి కమిషనర్ జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణణ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, కార్పొరేటర్లతో కలిసి లతో కలిసి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డు పత్రములను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా కొత్తగా పెళ్లయిన వారికి నూతన పేర్ల నమోదు అవకాశం ఉండేది కాదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అరులైన లబ్ధిదారులందరికీ కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డుల పంపిణీ అవసరాలను బట్టి నిరంతరం కొనసాగే ప్రక్రియ అని అన్నారు. నగరంలో మొన్నటి వరకు ఆషాడ మాసం బోనాల పండుగ జరిగిందని, ఇప్పుడు శ్రావణమాసం రేషన్ కార్డుల పంపిణీ పండుగ జరుగుతుందన్నారు. గతంలో రేషన్ కార్డు పై దొడ్డు బియ్యం ఇచ్చే వారని, అది పేదలకు ఇబ్బందికరంగా ఉండేదని, దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం అందజేస్తుందన్నారు. ఇది గొప్ప సామాజిక మార్పు అని పేర్కొన్నారు. పేద ప్రజల్లో మార్పు రావాలని ప్రభుత్వం మొదటి నుంచి దృఢ సంకల్పంతో పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీన జీతాలు పడుతున్నాయని, అలాగే ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను




ఏ ఒక్కటి ఆపడం లేదని పేర్కొన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూపాయలు 500 కే గ్యాస్ సిలిండర్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అంత చేస్తుందని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతు భరోసా పథకాలను కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రతి నియోజకవర్గానికి పేదలు ఉన్నచోటే పక్కా గృహాలు నిర్మించి ఇచ్చేందుకు 3500 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించే నిర్ణయం ప్రభుత్వం తీసుకుందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని లక్ష్యంతో జీరో ఒకటి తో మహిళలకు ఆర్థిక రుణాలు అందజేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే ముటాగోపాల్ మాట్లాడుతూ.. ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోకి పౌరసరఫరాల శాఖ సర్కిల్ 6,8,9 పరిధిలలో నివసించే పేద ప్రజలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, అర్హులైన ప్రతి దరఖాస్తారునికి కొత్త రేషన్ కార్డు మంజూరు చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముటాగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేద ప్రజలు ఇబ్బంది పడకుండా వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఆయన కోరారు. రేషన్ కార్డు లేని వారు ఆన్లైన్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి మాట్లాడుతూ.. రేషన్ కార్డు రాలేదని నిరాశ చెందోద్దు అని అన్నారు. ఇంకా రేషన్ కార్డుల వెరిఫికేషన్ జరుగుతున్నదని ఆమె పేర్కొన్నారు. ఇది చాలా పెద్ద ప్రక్రియ అని రేషన్ కార్డు కోసం చేసుకున్న దరఖాస్తు పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందజేస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా 55,000 మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. మరో లక్ష 30 వేల దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని పేర్కొన్నారు 2672 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను స్థానిక సర్కిల్ పరిధిలో అందజేస్తున్నామన్నారు. త్వరలో అందరికి రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. ప్రపంచంలోని చాలా దేశాల్లో ఆహార భద్రత పథకం లేదని, మన రాష్ట్రంలో కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల సర్కిల్ 6 ఏఎస్ఓ దీప్తి, సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ అంబర్పేట్ సర్కిల్ అధికారి వరలక్ష్మి, హిమాయత్ నగర్ తహసిల్దార్ సంధ్యారాణి, ముషీరాబాద్ తహసిల్దార్ కె. రాణా ప్రతాప్ సింగ్, కార్పొరేటర్లు సుప్రియ నవీన్ గౌడ్, గౌసుద్దీన్, పావని వినయ్ కుమార్, రవి చారి. బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు ముఠా జై సింహ, ఆర్ఎస్ పార్టీ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, మాజీ కార్పొరేటర్లు ఆర్ కల్పన యాదవ్, వాజిద్ హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెండెం శ్రీనివాస్ యాదవ్, పట్నం నాగభూషణం గౌడ్, సల్ల నరేందర్ బాబు, ఎండి మోహిన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పేదలకు సవ్యంగా అమలు చేయాలి : డిప్యూటీ సీఎం

రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అమలు అవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు జరిగేలా జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం మండల పరిధిలోని సోమశిల తెలంగాణ టూరిజం గెస్ట్ హౌస్ లో నాగర్ కర్నూల్ జిల్లా అధికారులతో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు డాక్టర్ రాజేష్ రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ ,కసిరెడ్డి నారాయణరెడ్డి, తూడి మేఘా రెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ఉప ముఖ్యమంత్రి జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులు, గురుకులాలు, విద్యా వైద్యం , వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై



జిల్లాస్థాయి అధికారులతో సమీక్షా సమావేశాన్ని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో లోటు పొరపాట్లకు తావు లేకుండా నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా, పూర్తి స్థాయిలో అమలు జరిగి ప్రజలకు ఉపయోగపడేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు.

## ట్రంప్ పెనాల్టీ హెచ్చరికలతో రష్యా నుంచి చమురు దిగుమతి ఆగిందంటూ వార్తలు..

**స్పష్టతనిచ్చిన ప్రభుత్వ వర్గాలు**



**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలతో రష్యా నుంచి భారత్ ఇంధనాన్ని కొనుగోలు చేయడం లేదంటూ వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడం లేదని తెలిసిందని, ఇది మంచి నిర్ణయమని అన్నారు. ఈ నేపథ్యంలో దీనిపై ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. ఆ వార్తలను తోసిపుచ్చాయి. భారత చమురు శుద్ధి సంస్థలు రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్నాయని ప్రభుత్వ వర్గాలు శనివారం స్పష్టం చేశాయి. ఇంధన దిగుమతులు మార్కెట్ డైనమిక్స్, జాతీయ ప్రయోజనాల దృష్టా జరుగుతున్నాయని పునరుద్ఘాటించాయి. భారత చమురు సంస్థలు రష్యన్ దిగుమతులను నిలిపివేసినట్లు తమకు ఎలాంటి సమాచారం లేదని స్పష్టం చేశాయి.

కాగా, ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో రష్యాపై పశ్చిమదేశాలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ మాస్కో నుంచి భారత్ పెద్ద మొత్తంలో చౌక ధరకు చమురు కొనుగోలు చేస్తోంది. దీనిపై పశ్చిమ దేశాలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. మాస్కోతో వ్యాపారం చేస్తోందన్న కారణం చూపుతూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై పెనాల్టీలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను దేశీయ సంస్థలు నిలిపివేశాయంటూ వార్తలు వస్తున్నాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ వంటి భారత్‌కు చెందిన ప్రభుత్వ చమురు శుద్ధి సంస్థలు గత వారం రోజులుగా మాస్కో నుంచి చమురు దిగుమతులను నిలిపివేసినట్లు ప్రచారం జరుగుతోంది.

ఈ వార్తలపై అధ్యక్షుడు ట్రంప్‌కూడా స్పందించిన విషయం తెలిసిందే. రష్యా నుంచి ఇంధనాన్ని ఇండియా కొనుగోలు చేయడం లేదని తెలిసిందని, ఇది మంచి నిర్ణయమని ట్రంప్ అన్నారు. అయితే దీనిపై సమగ్రమైన వివరాలు తెలియదన్నారు. ఇక ముందు రష్యా నుంచి ఇంధనాన్ని ఇండియా దిగుమతి చేసుకోదన్న వార్తలు వినిపించాయని, దాంట్లో ఎంత వాస్తవం ఉందో తనకు తెలియదని, ఒకవేళ అదే నిజమైతే అది మంచి నిర్ణయమని, దీనిపై పునరాలోచన చేస్తామని ట్రంప్ అన్నారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి వివిధ దేశాలపై ట్రంప్ సుంకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ట్రంప్ ఇచ్చిన ఎగ్జిక్యూటివ్ ఆదేశాల ప్రకారం ఇండియాపై 25 శాతం పన్ను పడనున్నది. అయితే రష్యా నుంచి సైనిక వస్తువులు, ఇంధనాన్ని కొనుగోలు చేస్తే భారత్‌పై పెనాల్టీ వేస్తామని ట్రంప్ అన్నారు. కానీ ఎంత పెనాల్టీ కట్టాలన్న దానిపై ఆయన ఏమీ క్లారిటీ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలోనే చమురు దిగుమతి ఆగిందంటూ వస్తున్న వార్తలపై ప్రభుత్వ వర్గాలు క్లారిటీ ఇచ్చాయి.

## మరో రెండు బ్యాంకులు విలీనం..

**రిజర్వ్ బ్యాంక్ ఆమోదం!**




**న్యూఢిల్లీ:** అప్పుడప్పుడు బ్యాంకుల్లో కొన్ని కుంభకోణాలు, లోపాలు చోటు చేసుకుంటాయి. బ్యాంకు వినియోగదారులకు సరైన సదుపాయాలు కల్పించడంలో బ్యాంకు విఫలమైతే రిజర్వ్ బ్యాంక్ చర్యలు చేపడుతుంటుంది. కొన్ని బ్యాంకులాను విలీనం చేస్తుంటుంది. దీంతో ఇప్పుడు రెండు బ్యాంకులు విలీనం చేసేందుకు ఆర్బీఐ ఆమోదం తెలిపింది..

దేశంలోనే అతిపెద్ద సహకార బ్యాంకు సరస్వత్ కో-ఆపరేటివ్ బ్యాంక్. న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్‌ను విలీనం చేసుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆమోదం పొందిందని కేంద్ర బ్యాంకు శుక్రవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది.

ఈ విలీనం ఆగస్టు 4, 2025 నుండి అమలులోకి వస్తుంది. సరస్వత్ బ్యాంక్ న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ అన్ని ఆస్తులు, బాధ్యతలను స్వీకరిస్తుంది. అలాగే దాని అన్ని శాఖలు సరస్వత్ బ్యాంక్ శాఖలుగా పనిచేస్తాయి. విలీన తేదీ తర్వాత అన్ని ఆస్తులు, బాధ్యతలను అలాగే దాని కస్టమర్లను బ్యాంక్ స్వాధీనం చేసుకుంటుంది.

ఈ విలీనం ప్రక్రియం పూర్తి చేయడానికి కేంద్ర బ్యాంకు, బ్యాంకింగ్ నియంత్రణ చట్టం, 1949లోని సెక్షన్ 56తో కలిపి, సెక్షన్ 44లోని సబ్-సెక్షన్ (4) కింద తన అధికారాలను వినియోగించింది. న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ డిపాజిటర్లతో సహా కస్టమర్లను ఆగస్టు 4, 2025 నుండి సరస్వత్ బ్యాంక్ కస్టమర్లుగా పరిగణిస్తారు. వారి ప్రయోజనాలకు పూర్తి రక్షణ ఉంటుంది.

జూలై 22, 2025న జరిగిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో సారస్వత్ బ్యాంక్ వాటాదారులచే విలీన ప్రక్రియ ఆమోదించింది. న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ వాటాదారులచే వారి వార్షిక సర్వసభ్య సమావేశంలో కూడా దీనిని ఆమోదించింది. అలాగే తరువాత ఆమోదం కోసం పంపింది. న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ తన టాప్ మేనేజ్‌మెంట్ సభ్యులతో సంబంధం ఉన్న రూ.122 కోట్ల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఫిబ్రవరి 2025 నుండి నియంత్రణా పరిశీలనలో ఉంది.

## సింగిల్ ఛార్జింగ్‌తో 142కి.మీ మైలేజ్..

**ధర కేవలం రూ.45,000 మాత్రమే.. రికార్డ్ స్థాయిలో అమ్మకాలు!**




**న్యూఢిల్లీ:** భారత మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. హీరో మోటోకార్ప్ జూలై 2025లో ఒక నెలలో అత్యధిక ఎలక్ట్రిక్ స్కూటర్ అమ్మకాలను నమోదు చేసింది. ప్రభుత్వ వాహన వెబ్‌సైట్ డేటా ప్రకారం, కంపెనీ 10,489 విడా స్కూటర్లను విక్రయించింది. 2022లో ఎలక్ట్రిక్ టూ-వీలర్ స్కూటర్ మార్కెట్‌లోకి ప్రవేశించిన తర్వాత ఇది మొదటిసారిగా 10,000 యూనిట్ల నెలవారీ అమ్మకాల సంఖ్యను దాటింది.

విడా జూలై 2025 అమ్మకాలు గత సంవత్సరంతో పోలిస్తే 107 శాతం పెరిగాయి (జూలై 2024: 5,067 యూనిట్లు), మార్చి 2025లో కంపెనీ గత నెల అమ్మకాలు 8,040 యూనిట్లను సులభంగా అధిగమించాయి. ఇది గత నెలలో రిటైల్ చేయబడిన 1.02 లక్షల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల నుండి హీరో మోటోకార్ప్ మొదటిసారిగా 10 శాతం నెలవారీ మార్కెట్ వాటాను సాధించడంలో సహాయపడింది.

## యశస్వీ, ఆకాశ్, సుందర్

# విధ్వంసం..





**ఓవల్:** అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీ విజేతను నిర్ణయించే ఓవల్ టెస్టులో సమిష్టిగా రాణించిన భారత జట్టు భారీ స్కోర్ కొట్టింది. ఆతిథ్య జట్టు బౌలర్లను వచ్చినవాళ్లు వచ్చినట్టు ఉతికేయగా.. కొండంత లక్ష్యాన్ని ముందుంచింది. మూడో రోజు ఓపెనర్ యశస్వీ జైస్వాల్(118) సెంచరీకి ఆకాశ్ దీప్ (66) తొలి అర్ధ శతకంతో విరుచుకుపడగా.. టీ సెషన్ తర్వాత రవీంద్ర జడేజా(53 ), వాషింగ్టన్ సుందర్(53 ) విధ్వంసక అర్ధ శతకంతో చెలరేగారు. జడ్డూ వెనుదిరిగాక టెయిలెండర్ల అండతో రెచ్చిపోయిన సుందర్ సిక్సర్లతో దడపుట్టించి జట్టు స్కోర్ 390 దాటించాడు. ధాటిగా ఆడబోయిన అతడు పదో వికెట్‌గా వెనుదిరగగా టీమిండియా ప్రత్యర్థికి 373 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

ఫలితాన్ని తేల్చే ఓవల్ టెస్టులో భారత బ్యాటింగ్ యూనిట్ గొప్పగా రాణించింది. ఒకరిద్దరూ విఫలమైనా.. ప్రత్యర్థికి సవాల్ విసిరే స్కోర్ చేసింది టీమిండియా. ఓవర్ నైట్ స్కోర్ 75/2తో మూడో రోజు ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ మ్యాచ్‌పై పట్టుబిగించింది. రెండో రోజే మెరుపు బ్యాటింగ్‌తో అర్ధ శతకం బాదేసిన ఓపెనర్ యశస్వీ (118) మూడో రోజు అదే జోరు చూపించాడు. నైట్ వాచ్‌మన్‌గా వచ్చిన ఆకాశ్(66) నమ్మశక్యంకాని విధంగా క్రీజులో పాతుకుపోయాడు. ఇంగ్లండ్ పేసర్ల ఎత్తుల్ని చిత్తు చేస్తూ యశస్వీ.. స్లిప్‌లో బంతిని బౌండరీ దాటిస్తుంటే ఫీల్డర్లు అయ్యో అని తల పట్టుకుంటున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 107 రన్స్ జోడించి మంచి పునాది వేశారు.

**తొలి హాఫ్ సెంచరీ..**

ఇంగ్లండ్ బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్న ఆకాశ్ కెరీర్లో తొలి హాఫ్ సెంచరీ బాదాడు. ఓవర్టన్ ఓవర్లో అతడు బౌండరీతో ఫిఫ్టీ సాధించాడు. అతడు ఔటయ్యాక వచ్చిన కెప్టెన్ గిల్ ఎక్కువ సేపు క్రీజులో నిలవలేదు. కరుణ్ నాయర్ సైతం నిరాశపరచగా.. మాంచెస్టర్ హీరో రవీంద్ర జడేజా (53), ధ్రువ్ జురెల్ (34) బాధ్యతగా ఆడారు.ఏడో వికెట్‌కు 50 రన్స్ జోడించి ఆధిక్యాన్ని 300లకు చేరింది. అయితే.. ఆ తర్వాత బంతికే ఓవర్టన్ బౌలింగ్‌లో జురెల్ ఎల్బీగా వెనుదిరిగాడు. అయినా సరే వాషింగ్టన్ సుందర్ (53) జతగా జడేజా భారీ స్కోర్ అందించే పనిలో నిమగ్నమయ్యాడు.

ధనాధన్ ఆడిన జడ్డూను టంగ్ ఔట్ చేయగా.. సుందర్ గేర్ మార్చి విధ్వంసం కొనసాగించాడు. టంగ్ వేసిన ఓవర్లో రెండు ఫోర్లు, సిక్సర్ బాదిన అతడు.. సూపర్ ఫిఫ్టీతో జట్టు స్కోర్ 390 దాటించాడు. కానీ, అతడి ఓవర్లోనే పెద్ద షాట్‌కు యత్నించిన సుందర్ మిడాన్‌లో క్రాలే చేతికి చిక్కాడు. దాంతో.. రెండో ఇన్నింగ్స్‌లో 396 వద్ద భారత జట్టు పోరాటం ముగిసింది.

## జస్‌ప్రీత్ బుమ్రా ఆసియా కప్ ఆడేది డౌటే..?

**నిర్ణయం తీసుకోనున్న చీఫ్ సెలెక్టర్, కోచ్..!**



**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా మరోసారి వార్తలకెక్కాడు. ఇంగ్లండ్‌తో శుక్రవారం మొదలైన ఐదో టెస్టుకు అందుబాటులో లేకపోవడంతో బుమ్రాను విడుదల చేశారు. తాజాగా వచ్చే నెలలో మొదలుకానున్న ఆసియా కప్‌లో కూడా ఆడడం సస్పెన్స్‌గా మారింది. పలు మీడియా నివేదికల ప్రకారం టీ20 టోర్నీలో ఆడితే.. రాబోయే సిరీస్‌లో ఆడడం కష్టంగానే ఉన్నది. ఈ పరిస్థితుల్లో బుమ్రాకు ఆసియా కప్ నుంచి విశ్రాంతి ఇచ్చే అవకాశాలున్నాయి. ఈ విషయంలో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. ఆసియా కప్ ఈ ఏడాది సెప్టెంబర్ 9 నుంచి మొదలుకానున్నది.

అదే సమయంలో భారత్, పాకిస్తాన్ మధ్య సెప్టెంబర్ 14న మ్యాచ్ జరగనున్నది. ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో మూడు మ్యాచులకు అందుబాటులో ఉన్న బుమ్రాను శుక్రవారం జాతీయ జట్టును రిలీజ్ చేశారు. తాజాగా ఆసియా కప్ ఆడుతాడా? లేదా? అన్నది చర్చనీయాంశంగా మారింది. బుమ్రా మూడు మ్యాచుల్లో 119.4 ఓవర్లు బౌలింగ్ చేసి 14 వికెట్లు బౌలింగ్ తీశారు. హెడింగ్లీ, లార్డ్స్ టెస్ట్ మ్యాచుల్లో బుమ్రా ఒక ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీశాడు. అయితే, మాంచెస్టర్‌లో బుమ్రా తన కెరీర్‌లో తొలిసారిగా ఇన్నింగ్స్‌లో 100 కంటే ఎక్కువ పరుగులు ఇచ్చాడు. బుమ్రా ఇప్పటి వరకు 48 టెస్ట్‌ల్లో 219 వికెట్లు పడగొట్టాడు. భారత్ లండన్‌కు బయలుదేరే ముందు సెలక్షన్ కమిటీ చీఫ్ అజిత్ అగార్కర్ ఫాస్ట్ బౌలర్ పనిభారాన్ని దృష్టిలో పెట్టుకొని మూడు మ్యాచులకు అందుబాటులో ఉంటాడని తెలిపాడు.

భారత్ ఆసియా కప్ టీ20 టోర్నీలో ఆడాల్సి ఉంది. బుమ్రాను టోర్నీకి ఎంపిక చేస్తే ఆసియా కప్ తర్వాత వారంలోపు వెస్టిండిస్‌తో జరిగే టెస్ట్ సిరీస్‌లో ఆడే అవకాశాలు తగ్గుతాయి. ఆసియా కప్ సెప్టెంబర్ 29న ముగుస్తుంది. వెస్టిండీస్‌తో తొలి టెస్ట్ అక్టోబర్ 2న అహ్మదాబాద్‌లో మొదలవుతుంది. ఆ తర్వాత నవంబర్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ రెండు టెస్ట్‌ల సిరీస్ ఆడాల్సి ఉంటుంది. వరుస టోర్నీల నేపథ్యంలో ఈ నిర్ణయం కాలా కష్టమైందని బీసీసీఐ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. వాస్తవానికి బుమ్రాకు టెస్ట్ క్రికెట్ అంటే ఇష్టం.

## ఒకే జట్టులో షమీ, సూర్యవంశీ..

# కెప్టెన్‌గా ఇషాన్..!



**న్యూఢిల్లీ:** భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ దేశవాళీలో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు. మోకాలి గాయం తర్వాత జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన ఈ స్పీడ్‌స్టర్ దులీప్ ట్రోఫీలో వికెట్ల వేటతో టీమిండియా తలుపు తట్టాలనే కసితో ఉన్నాడు. ఇషాన్ కిషన్ సారథ్యంలో ఈస్ట్ జోన్ తరఫున బరిలోకి దిగనున్నాడు షమీ. ఐపీఎల్‌లో రెండో వేగవంతమైన శతకంతో రికార్డు సృష్టించిన వైభవ్ సూర్యవంశీ , రియాన్ పరాగ్‌లు కూడా స్క్వాడ్‌లో ఉన్నారు.

ఐపీఎల్‌తో ఫామ్ అందుకున్న ఇషాన్‌కే ఈస్ట్ జోన్ పగ్గాలు అప్పగించడంతో.. సీనియర్ ప్లేయర్ అభిమన్యు ఈశ్వరన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. స్క్వాడ్‌లోని షమీకి 34 ఏళ్లు కాగా.. వైభవ్‌కు 14 సంవత్సరాలు మాత్రమే. ఇరవై ఏళ్ల వయోభేదం ఉన్న ఈ ఇద్దరూ ఒకే జట్టుకు ఆడుతుండడం విశేషం. అయితే.. రంజీ ట్రోఫీలో నిరుడు బెంగాల్ తరఫున అత్యధిక రన్స్ బాదిన సుదీప్ చటర్జీని సెలెక్టర్లు పక్కన పెట్టేశారు.

**ఈస్ట్ జోన్ స్క్వాడ్:** ఇషాన్ కిషన్(కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్(వైస్ కెప్టెన్), సందీప్ పట్నాయక్, విరాట్ సింగ్ డెనిశ్ దాస్ శరందీప్ సింగ్ కుమార్ కుషగ్ర, రియాన్ పరాగ్, ఉత్కర్ష్ సింగ్, మనీషి, సూరజ్ సింధు జైస్వాల్, ముకేశ్ కుమార్, ఆకాశ్ దీప్, షమీ.

**స్టాండ్ బై ప్లేయర్లు:** ముఖ్తర్ హుసేన్, ఆశీర్వాద్ స్వేన్, వైభవ్ సూర్యవంశీ, సాత్విక్ సమాల్, సుదీప్ కుమార్ ఘరమి, రాహుల్ సింగ్.

దేశవాళీ సీజన్ 2025-26 దులీప్ ట్రోఫీతో ప్రారంభం కానుంది. చాలా సీజన్ల తర్వాత ఆరు జోన్లతో నిర్వహిస్తున్న ఈ ట్రోఫీ ఆగస్టు 28న షురూ అవుతుంది. జాతీయ జట్టులో చోటు ఆశిస్తున్న ఇషాన్ కిషన్, షమీలకు ఈ టోర్నీ కీలకం. ఐపీఎల్ 18వ సీజన్‌లో ఇద్దరూ సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడారు. కిషన్ మెరుపు సెంచరీతో అదరగొట్టినా.. ఆ తర్వాత తేలిపోయాడు. లీగ్ మ్యాచ్‌ల ఆఖర్లో మళ్లీ ఈ లెఫ్ట్ హ్యాండర్ బ్యాట్ ఝులిపించాడంతే. షమీ విషయానికొస్తే.. ఆరు వికెట్లతో తీవ్రంగా నిరాశపరిచాడు. సో.. డొమెస్టిక్ క్రికెట్‌లో ఫామ్ చాటుకొని.. టీమిండియా జెర్సీ వేసుకోవాలని ఇద్దరూ భావిస్తున్నారు. ఇద్దరికీ ఆల్ ది బెస్ట్ చెబుదామా.

## మహ్‌వశ్‌తో డేటింగ్ వార్తలు..

# ఎట్టకేలకు స్పష్టతనిచ్చిన చాహల్



**న్యూఢిల్లీ:** ధనశ్రీ వర్మతో విడాకుల అనంతరం రేడియో జాకీ మహ్‌వశ్‌తో టీమ్‌ఇండియా క్రికెటర్ యజువేంద్ర చాహల్ డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొంతకాలంగా జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మహ్‌వశ్‌తో రిలేషన్‌షిప్‌పై చాహల్ ఎట్టకేలకు నోరు విప్పారు. డేటింగ్ రూమర్స్‌కు చెక్‌పెట్టారు. మహ్‌వశ్‌తో డేటింగ్ వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు.

రాజ్ షమానీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మహ్‌వశ్‌తో లేదా మరెవరితోనైనా డేటింగ్‌లో ఉన్నారా అని చాహల్‌ను ప్రశ్నించగా.. లేదని సమాధానం ఇచ్చారు. 'లేదు. అలాంటిదేమీ లేదు. ప్రజలు ఏమి ఆలోచించాలనుకుంటున్నారో అది ఆలోచించుకోవచ్చు. నాకు మునుపటి బంధం నుంచి బయటపడటానికి కాస్త సమయం పడుతుంది. ప్రస్తుతానికి ఎవరితోనూ డేటింగ్ చేయట్లేదు' అని స్పష్టం చేశారు. తాను ఎవరితోనైనా బయట కనిపిస్తే వారితో నాకు సంబంధం ఉందని మాట్లాడేసుకుంటున్నారు అంటూ చెప్పుకొచ్చారు.

మహ్‌వశ్‌తో డిన్నర్‌కు వెళ్లినట్లు కొన్ని ఫొటోలు వైరల్ అయిన విషయం తెలిసిందే. దీనిపై చాహల్ స్పందిస్తూ.. 'క్రిస్మస్ సందర్భంగా ఐదుగురి ఫ్రెండ్స్‌తో కలిసి డిన్నర్‌కు వెళ్లాం. అయితే కొందరు నేను, మహ్‌వశ్ మాత్రమే వెళ్లినట్లు ఫొటోను క్రాప్ చేసిన ప్రచారం చేశారు. దీనికారణంగా స్నేహితులతో కలిసి బయటకు కూడా వెళ్లలేని పరిస్థితి' అని చెప్పుకొచ్చారు. అంతేకాదు మరికొన్ని ఘటనలపై కూడా చాహల్ స్పందించారు.

'నేను విమానాశ్రయానికి వెళ్లాల్సి ఉండగా.. తను నన్ను డ్రాప్ చేస్తానని చెప్పింది. దీంతో ఓ హోటల్ వద్ద కారు కోసం వేచి ఉన్నాం. ఆ సమయంలో ఎవరో వీడియో రికార్డ్ చేశారు. నేను నా జుట్టు సరిచేసుకుంటున్నా. దీంతో మేమిద్దరం హోటల్ గది నుంచి బయటకు వస్తున్నట్లుగా ప్రచారం చేయడం మొదలు పెట్టారు. ఆ విషయం నన్ను చాలా బాధించింది' అని చాహల్ వివరించారు.

**మహ్‌వశ్‌తో చాహల్ ప్రేమాయణం..**

ధనశ్రీ వర్మతో విడాకుల అనంతరం చాహల్ మళ్లీ ప్రేమలో పడ్డట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఆర్జే మహ్‌వశ్‌తో చాహల్ డేటింగ్‌లో ఉన్నట్లు బీ టౌన్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. దుబాయ్ వేదికగా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను వీరిద్దరు కలిసి చూడడం.. మ్యాచ్‌కు ముందు ఓ సెల్ఫీ వీడియో, ఫొటోలను ఆమె తన ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేయడంతో ఈ వార్తలకు బలం చేకురింది. ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచే కాకుండా పలు ఈవెంట్స్‌లో కూడా ఇద్దరూ జంటగానే మెరిశారు. దీంతో చాహల్ మహ్‌వశ్‌తో ప్రేమలో పడ్డట్లు టాక్ నడుస్తోంది. ఈ ప్రచారానికి చాహల్ తాజాగా చెక్ పెట్టేశారు.

**ధనశ్రీతో విడాకులు**

దంత వైద్యురాలైన ధనశ్రీ 2020 డిసెంబర్ 22న చాహల్‌ను వివాహం చేసుకుంది. కొరియోగ్రాఫర్‌గా, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది ధనశ్రీ. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ ఇన్‌స్టాలో రీల్స్ చేస్తూ ఫ్యాన్స్‌ను అలరిస్తూనే ఉన్నారు. అయితే, ఇద్దరి మధ్య వచ్చిన మనస్పర్థలు విడాకులకు దారి తీశాయి.

MOVIE TIME

# ఓజీ నుంచి పవర్‌ఫుల్ సాంగ్ విడుదల




**టాకీస్:** టాలీవుడ్ హీరో పవన్ కల్యాణ్ నటిస్తోన్న తాజా చిత్రం 'ఓజీ'. 'సాహో' ఫేం సుజీత్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ సినిమా సిద్ధమవుతుండగా.. ఇప్పటికే వచ్చిన ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ అభిమానులను అలరించాయి ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ నుంచి పవర్‌ఫుల్ సాంగ్ ఓజీ ఫైర్ స్టోమ్ ని విడుదల చేశారు మేకర్స్. థమన్ సంగీతం అందించిన ఈ పాటకు థమన్ ఎస్ , నజీరుద్దీన్ భరతరాజ్ , సిలంబరసన్ టిఆర్ (శింబు) , దీపక్ బ్లూ, రాజా కుమారి కలిసి పాడారు.



# చెప్పు తెగుద్ది..

## అనసూయ స్ట్రాంగ్ వార్నింగ్

**టాకీస్:** టాలీవుడ్ నటి, యాంకర్ అనసూయ కొందరు యువకులకు అసభ్య కామెంట్లు చేస్తే చెప్పు తెగుద్ది అంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా మార్కపూరంలోని ఓ షాపింగ్‌మాల్ ఓపెనింగ్‌లో భాగంగా అక్కడికి వెళ్లిన అనసూయని కొందరు ఆకతాయిలు కామెంట్లు- చేయడం మొదలుపెట్టారు. దీంతో అనసూయ వారికి గట్టిగా వార్నింగ్ ఇచ్చింది. చెప్పు తెగుద్ది.. మీ ఇంట్లో అమ్మ, చెల్లి, భార్య కుటుంబసభ్యులను ఇలాగే కామెంట్లు- చేస్తే ఊరుకుంటారా. పెద్దవాళ్లకి మర్యాద ఇవ్వడం మీ ఇంట్లో నేర్పలేదా అంటూ అనసూయ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

## దూసుకుపోతున్న సైయారా మూవీ

**టాకీస్:** అహన్ పాండే, అనీత్ పడ్డా జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్-టైనర్ 'సైయారా' మూవీ ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తోంది. ఈ ప్రేమకథా చిత్రం ప్రస్తుతం మూడో వారంలోకి అడుగు పెట్టింది. శుక్రవారం 'సన్ ఆఫ్ సర్దార్ 2' , 'ధడక్ 2' విడుదలైనప్పటికీ 'సైయారా'కు ప్రేక్షకుల్లో ఆదరణ తగ్గలేదు. ఈ చిత్రం 15 రోజుల్లో దాదాపు రూ.284 కోట్లను రాబట్టింది. ఈ వారాంతానికి రూ.300 కోట్లు- వసూలు చేస్తుందని మార్కెట్ వర్గాలు అంచనాలు వేస్తున్నాయి. 'సైయారా' రెండో వారంలో 107.75 కోట్లను రాబట్టింది. బాలీవుడ్‌లో రెండో వారంలో అత్యధిక వసూళ్లు సాధించిన పదో చిత్రంగా నిలిచి రికార్డు సృష్టించింది. 'ది కశ్మీర్ ఫైల్స్' (రూ.108.97 కోట్లు-), 'దంగల్' (రూ.115.96 కోట్లు-), జవాన్ (రూ.125.46 కోట్లు-) చిత్రాలు 'సైయారా' కంటే ముందున్నాయి. మొదటివారంతో పోల్చుకుంటే.. రెండో వారంలో కలెక్షన్లు కాస్త తగ్గినప్పటికీ.. మూడోవారమూ విజయవంతంగా





ప్రదర్శితమయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అజయ్‌దేవ్‌గణ్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్ 2', సిద్ధాంత్ చతుర్వేది ప్రధాన పాత్ర పోషించిన 'ధడక్ 2'కు ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందనే దక్కుతోంది. ఇది జులై 18న విడుదలైన 'సైయారా'కు కలిసివస్తోంది.





# బంపర్ ఆఫర్ కొట్టేసిన సంయుక్త..

టాకీస్: పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో నటించిన భీమ్లా నాయక్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది సంయుక్త మీనన్. ఇందులో సెకండ్ హీరోయిన్‌గా కనిపించిన ఈ ముద్దుగుమ్మ.. ఫస్ట్ మూవీతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. అందం, అభినయంతో కట్టిపడేసింది ఈ వయ్యారి. దీంతో తెలుగులో ఈ అమ్మడుకు వరుస అవకాశాలు క్యూ కట్టాయి. బింబిసార, సార్, విరూపాక్ష వంటి చిత్రాలతో వరుసగా హిట్స్ అందుకుంది. దీంతో తక్కువ సమయంలోనే టాలీవుడ్ ఇండస్ట్రీలో గోల్డెన్ బ్యూటీగా ట్యాగ్ సొంతం చేసుకుంది. ఇప్పటివరకు ఈ అమ్మడు నటించిన చిత్రాలన్నీ సూపర్ హిట్ అయినప్పటికీ అవకాశాలు మాత్రం అంతగా రాలేదు. ప్రస్తుతం నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న స్వయంభు చిత్రంలో నటిస్తుంది. ఈ బ్యూటీ చేతిలో కేవలం ఒక్క సినిమా మాత్రమే ఉంది. ఈ క్రమంలో తాజాగా మరో క్రేజీ ఛాన్స్ కొట్టేసింది.

సంయుక్త మీనన్ తాజాగా మరో బంపర్ ఆఫర్ కొట్టేసింది. మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇప్పటికే విశ్వంభర షూటింగ్ కంప్లీట్ చేసిన చిరు.. ఇప్పుడు డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో కొత్త ప్రాజెక్ట్ చేస్తున్న సంగతి తెలసిందే. ఇందులో నయనతార కథానాయి కగా నటిస్తుండగా.. ఇటీవలే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ అయ్యింది. ఈ చిత్రానికి మన శంకర వరప్రసాద్ గారు అనే టైటిల్ పరిశీలిస్తున్నట్లు టాక్. ఈ సినిమా తర్వాత డైరెక్టర్ బాబీతో చిరు ఓ సినిమా చేయనున్నట్లు టాక్ వినిపిస్తుంది. వీరిద్దరి కాంబోలో రాబోతున్న ప్రాజెక్టును కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మించనున్నట్లు సమాచారం. ఈ సినిమాలో కేరళ కుట్టి సంయుక్త మీనన్ కథానాయికగా నటించ నున్నట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుందని తెలుస్తోంది. ఆఫర్స్ కోసం ఎదురుచూస్తున్న సంయుక్తకు చిరు సినిమాలో ఛాన్స్ వచ్చిందంటే ఈ అమ్మడు కెరీర్ మలుపు తిప్పినట్లే ఇక.

# నా రాముడు ఎప్పటికీ రామ్‌చరణే

## మహావతార్ నరసింహ డైరెక్టర్ అశ్విని కుమార్

**టాకీస్:** హోంబలే ఫిల్మ్స్ బ్యానర్‌పై మహావతార్ సినెమాటిక్ యూనివర్స్నుంచి వచ్చిన తొలి మైథలాజికల్ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్ 'మహావతార్ నరసింహ' బాక్సాఫీస్ వద్ద హవా కొనసాగిస్తోంది. విడుదలైనప్పటి నుంచే అద్భుత రెస్పాన్స్ దక్కించుకున్న ఈ చిత్రం రెండో వీకెండ్‌లో మరింత కలెక్షన్స్ రాబడుతుంది. అడ్వాన్స్ బుకింగ్స్ పెద్ద ఎత్తున నమోదవుతుండటంతో, సినిమా హాళ్ల వద్ద సందడి నెలకొంది. ఈ విజయం నేపథ్యంలో దర్శకుడు అశ్విన్ కుమార్ కూడా చిత్రానికి మరింత బజ్ తీసుకొచ్చే భాగంగా పోస్ట్-రిలీజ్ ప్రమోషన్లలో పాల్గొంటున్నారు. ఇకపోతే, తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో డైరెక్టర్ అశ్విన్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ ఈ ఫ్రాంచైజీలో లైవ్ యాక్షన్ ఫిల్మ్ తీసే అవకాశం వస్తే.. అందులో శ్రీరాముడిగా ఎవరిని తీసుకుంటారనే ప్రశ్నకు ఆయన నేరుగా రామ్‌చరణ్ పేరును చెప్పుకొచ్చాడు. నిజానికి సోషల్ మీడియాలో ఇప్పటికే రామ్‌చరణ్‌కి శ్రీరాముడి పాత్రకు భారీ డిమాండ్ ఉంది. డైరెక్టర్ అశ్విన్ కుమార్ తాజాగా చేసిన వ్యాఖ్యలు వాటికి మరింత అతన్ని ఇచ్చాయి.





# రెండోభాగం మరింత ఆసక్తిగా ఉంటుంది

## కింగ్డమ్ సీరియల్‌పై విజయ్ దేవరకొండ

**టాకీస్:** విజయ్ దేవరకొండ కథా నాయకుడిగా నటించిన 'కింగ్‌డమ్' చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తూ భారీ వసూళ్లను రాబడుతోంది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సత్యదేవ్, భాగ్యశ్రీ బోర్సే, వెంకటేష్ ముఖ్య పాత్రలు పోషించారు. భారీ అంచనాల నడుమ జూలై 31వ తేదీన విడుదలైన 'కింగ్‌డమ్' చిత్రం.. విమర్శకుల ప్రశంసలతో పాటు, ప్రేక్షకులను మెప్పు పొందుతోంది. అన్నదమ్ముల అను బంధం నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా.. వెండితెరపై ఓ కొత్త అనుభూతిని కలిగిస్తోందని, విజువల్ గా అద్భుతంగా ఉందని చూసిన ప్రతి ఒక్కరూ చెబుతున్నారు. 'కింగ్‌డమ్' చిత్రానికి ప్రేక్షకుల నుంచి వస్తున్న విశేష స్పందన నేపథ్యంలో.. తాజాగా పాత్రికేయులతో ముచ్చటించిన విజయ్ దేవరకొండ, పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కేవలం తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే కాకుండా.. ఇతర రాష్ట్రాల్లో, ఓవర్సీస్ లో విశేష స్పందన లభిస్తుంది. ముఖ్యంగా మలయాళంలో ఈ స్థాయి స్పందన ఊహించలేదు. మలయాళ వెర్షన్ విడుదల చేయకపోయినా.. అక్కడి ప్రేక్షకులు ఇంతటి ప్రేమ చూపించడం చాలా ఆనందంగా ఉందని విజయ్ అన్నారు. కెరీర్ ప్రారంభంలో సినిమా హిట్ అయితే సెలబ్రేట్ చేసుకోవాలనే ఆలోచన ఉండదు. ఎందుకంటే ఒక సినిమా హిట్ అయితే ఇంకో సినిమా చేసే అవకాశం వస్తుందని ఆశ ఉంటుంది. పెళ్లి చూపులు హిట్ అయినప్పుడు.. ఇంకొన్ని అవకాశాలు వస్తాయని ఆనందపడ్డాను. కానీ, ఇప్పుడు అలా కాదు. సినిమా హిట్ అయితే ఆనందం కంటే కూడా మరిన్ని మంచి సినిమాలు చేయాలనే బాధ్యత ఎక్కువగా ఉంటుంది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.